ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 26 ఏప్రిల్ 2025 | 3



కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38 (శుక్రవారం)
కనిష్ఠం : 26.4

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.26 కోట్లు 5



మా బాబే బాగున్నావా : పవన్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న మహిళ



మీ కోసం నేనున్నాను : అభిమానులకు పవన్ అభివాదం



కలిసి.. మెలిసి ఉందాం
వర్మ, ఎంపీ ఉదయ్‌లతో కలిసి ప్రారంభోత్సవం చేస్తున్న పవన్

మీ ప్రేమకు.. అభివందనం!

10 నెలలు.. పిఠాపురంలో రూ.100 కోట్ల అభివృద్ధి

- మాట నిలబెట్టుకుంటున్నాం
- పిఠాపురం అభివృద్ధి చేస్తున్నాం
- ఆర్వోబీ పనులకు టెండర్లు
- శాంతిభద్రతలపై రాజీ లేదు
- తప్పుచేస్తే ఉపేక్షించం
- పెద్దాసుపత్రికి శంకుస్థాపన
- అంతా కలిసి పనిచేస్తాం
- పవన్ సుడిగాలి పర్యటన

(కాకినాడ/పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటున్నాం.. నూరు శాతం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాల్లో శుక్రవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. గడచిన పది నెలల్లో పిఠాపురం నియోజకవర్గంలో రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తద్వారా 25 వేల మందికి పని కల్పించామని తెలిపారు. మూడు లక్షల మంది ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. పిఠాపురం ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ అనుమతిచ్చారని త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలవుతుందని ప్రకటించారు. ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్ర రైల్వే మంత్రితో మాట్లాడగా ఆర్వోబీ నిర్మాణానికి నిధులివ్వడానికి అంగీకరించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ, కూటమి నేతలతో కలిసి పనిచేస్తామని ప్రకటించారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని పవన్‌కల్యాణ్ స్పష్టంచేశారు. క్రిమినల్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఏ పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. పవన్‌కల్యాణ్ ఉదయం 9.30 గంటలకు పిఠాపురం చేరుకోవాల్సి ఉండగా మూడు గంటల ఆలస్యంగా 12.27 గంటలకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద నాయకులు, జిల్లా అధికారులు స్వాగతం పలికారు. అయితే నాయకులు హెలికాప్టర్ వద్దకు రాగా పైలట్ వారిని వెనక్కు వెళ్లాలని కాస్త విసురుగా చెప్పారు. ఇది చూసిన పవన్ నేతలను హెలికాప్టర్ వద్దకు రమ్మని, పైలట్ వైపు చూస్తూ నేతలను ఏమీ అనవద్దని సూచించారు. పవన్ రోడ్డు మార్గాన పిఠాపురం వస్తూ యండపల్లి, కొండెవరం, నవఖండ్రవాడ తదితర గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న వారిని చూసి ఆగి వారి సమస్యలు తెలుసుకున్నారు. పిఠాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మహిళల ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభించారు. రైతులకు టార్పాలిన్లు, స్ప్రేయర్లు, రోటావేటర్లు, కిసాన్ డ్రోన్ పంపిణీ చేశారు.ముస్లింలు, మహిళలను కలిశారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నియోజకవర్గంలోని సీసీ రోడ్లు, డ్రెయిన్లు, బీటీ రోడ్లు, గోకులాలును ప్రారంభించారు.అనంతరం హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ అరగంటకు పైగా కార్వ్యాన్‌లో ఉండిపోయి అనంతరం హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం విమానాశ్రయం, అక్కడ నుంచి విజయవాడ చేరుకున్నారు. ఆయన వెంట కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, టీటీడీ బోర్డు సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జేసీ రాహుల్ మీనా,జిల్లా ఎస్పీ బిందుమాధవ్, పాడా పీడీ చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన

అభివృద్ధి ఇలా..

పిఠాపురం నియోజకవర్గంలోని పలుగ్రామాల్లో రూ.18.02 కోట్లతో 31.59 కి.మీల మేర 276 సిమెంట్ రోడ్లు నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించామని పవన్‌కల్యాణ్ అన్నారు. 5.21 కి.మీల పొడవునా ఏడు తారురోడ్లను రూ.3.20 కోట్లతో పూర్తి చేశామని, వీటి ద్వారా 300 మంది కాంట్రాక్టర్లకు, 5 వేల మంది శ్రామికులకు పనికల్పించామన్నారు. 434 గోదాంలతోపాటు వివిధ పనుల నిమిత్తం రూ.8.68 కోట్లు వ్యయం చేశామన్నారు. మరో రూ.21.58 కోట్లతో చేపట్టిన పనులు మరో మూడు నెలల్లో పూర్తవనున్నాయన్నారు. కొత్తపల్లిలో రూ.2 కోట్లతో టీటీడీ కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నామన్నారు. 225 ఏళ్ల చరిత్ర కలిగిన గొల్లప్రోలు సీతారామస్వామి దేవస్థానంలో రూ.1.32 కోట్లతో ప్రాకార మండపం నిర్మిస్తున్నామన్నారు. చేబ్రోలు సీతారామస్వామి దేవస్థానంలో కాలక్షేప మంటపం, రథశాల నిర్మిస్తున్నామని, మహిళలకు ఉచిత దర్జీ శిక్షణ ఇచ్చి 3,456 కుట్టుమిషన్లు ఉచితంగా అందజేస్తామన్నారు. రైతులకు రూ.26లక్షల వ్యయంతో రెండు వేల టార్పాలిన్లు అందజేస్తామని, రూ.1.94 కోట్లు వ్యయంతో 14 రోటోవీటర్లు, 39 పవర్‌టిల్లర్లు, 50 స్ప్రేయర్లు, కిసాన్ డ్రోన్లను రైతులకు అందజేస్తున్నట్టు చెప్పారు. దీనివల్ల 25 వేల ఎకరాల పంటకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

పోలీసులు వర్సెస్ వర్మ

పిఠాపురం అంబేద్కర్ కమ్యూనిటీ హాలు వద్ద పోలీసులకు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వర్మతోపాటు వచ్చిన టీడీపీ నేతలను పోలీసులు లోపలకు అనుమతించలేదు. దీనిపై వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని అనుమతించకపోతే తాను వెళ్లిపోతానని వర్మ హెచ్చరించడంతో ఎస్పీ బిందుమాధవ్ సముదాయించారు.

నిధుల విడుదల ఇలా..

పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో తాగునీరు, మురుగునీటి వ్యవస్థ మెరుగుదల, ఇతర పనుల నిమిత్తం ప్రత్యేక గ్రాంటుగా మునిసిపల్‌శాఖ మంత్రి నారాయణ రూ.4 కోట్లు మంజూరు చేశారని పవన్ చెప్పారు. వీటితో త్వరలోనే పనులు చేపడతామన్నారు. పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో ఓహెచ్ఎస్ఆర్, పైప్‌లైన్ల మరమ్మతులు, మురుగునీటి నిర్వహణకు కాకినాడ ఎంపీ నిధులు నుంచి రూ.50 లక్షలు, హౌసింగ్ నుంచి రూ.50 లక్షలు కేటాయించినట్టు చెప్పారు.



ఆసుపత్రి ఇలా..

పిఠాపురం సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన పవన్ వైద్యాధికారులతో మాట్లాడారు. ఆసుపత్రి నిర్మాణం ఏ విధంగ ఉండబోతోందో అధికారులు ప్రజంటేషన్ ఇస్తుండగా.. ఆసుపత్రి అందంగా, ఆరోగ్యంగా ఉండాలంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో పిఠాపురం బిడ్డ పవన్ అని కొందరు నినదించగా నవ్వుకుంటూ ముందుకు సాగారు.



పెద్దాపురం పట్టణంలో మున్సిపల్ జంక్షన్‌వద్ద ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి



సర్పవరం జంక్షన్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, జనసేన కార్యకర్తలు

'ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి'

జమ్మూకాశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతం పెహెల్గాంలో ఉగ్రవాదులు అత్యంత పాశవికంగా పర్యాటకులను కాల్చి చంపడం హేయమైన చర్య అని పలువురు ఖండించారు. ఈ దాడిని నిరసిస్తూ జిల్లాలో పలుచోట్ల కూటమి నేతలు శాంతి ర్యాలీలు నిర్వహించారు. కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. జిల్లావ్యాప్తంగా జరిగిన ర్యాలీల్లో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

కాల్వలు.. క్లీన్‌గా!



రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలులో పంట కాలువ ఇలా..

వేసవిలో పంట కాల్వలకు మరమ్మతులు

- 1747 పనులకు నివేదిక
- 66.64 కోట్ల ప్రతిపాదనలు
- రెండు రోజుల్లో క్లియరెన్స్
- 33 నియోజకవర్గాలపై దృష్టి
- తూడు తొలగింపు చర్యలు
- రేపు కాల్వల మూసివేత
- 10 లక్షల్లోపు నీటి సంఘాలకు..
- కాలువల పొడవు 4 వేల కి.మీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)


ప్రభుత్వం అంటే ఎలా ఉండాలి.. ప్రజల సమస్యలు పరిష్కరించాలి.. ప్రజలకు సమస్యలు రాకుండా చూసుకోవాలి. ప్రస్తుత ప్రభుత్వం అదే చేస్తోంది. దీనిలో భాగంగా పంట కాల్వలపై అభివృద్ధిపై దృష్టి పెట్టింది.. గత వైసీపీ ప్రభుత్వంలో అయితే ఐదేళ్లూ ఆ ఊసే లేదు. నీటి సంఘాలను పట్టించుకోలేదు. అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సీజన్‌లో కాలువల ద్వారా నీరందక రైతులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. వైపు భారీవర్షాల వల్ల ముంపు ఏర్పడినపుడు చేలలోని నీరు తిరిగి, బోదుల గుండా బయటకు వచ్చే వీలు లేక నష్టాల పాలయ్యారు. రేపో ఎల్లుండో కాల్వలు కట్టివేయనున్నారు. ఈ నేపథ్యంలో పంట కాల్వల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.

పంట కాల్వల ఆధునికీకరణకు..


ధవళేశ్వరం బ్యారేజి పరిధిలో తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలతోపాటు, వాటి పిల్ల కాలువలు, బోదెలు ఉంటాయి. అవన్నీ శుభ్రంగా, పటిష్ఠంగా ఉంటేనే నీరుపారుదల సక్రమంగా ఉంటుంది. గోదావరి బ్యారేజీ నుంచి కాలువల్లోకి వెళ్లిన నీరు సులభంగా పంటబోదెల ద్వారా చేలల్లోకి చేరుతోంది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతి ఏటా సమ్మర్‌లో కాలువల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ఎం) నిధులు ఇచ్చి నీటి సంఘాలతో పనులు చేయించేవారు. ఈ ఏడాది అదే విధానాన్ని అవలంబించనున్నారు. ఈమేరకు ముందస్తుగా నీటి సంఘాలను ఎంపిక చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు, కొవ్వూరు డివిజన్‌లో మొత్తం నీటి సంఘాలు 432 ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లు 37, ప్రాజెక్టు కమిటీ (పీసీ)లు 8 ఉన్నాయి. అందులో తూర్పుగోదావరి జిల్లాలో నీటి సంఘాలు 113, డీసీలు 6, పీసీలు 2 ఉన్నాయి. అలాగే అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నీటి సంఘాలు 83, డీసీలు 14, పీసీ 1 ఉంది. కాకినాడ జిల్లాలో నీటి సంఘాలు 236, డీసీలు 17, పీసీలు 5 ఉన్నాయి. ప్రస్తుతం రూ.10 లక్షల్లోపు కాలువల అభివృద్ధి పనులన్నీ వీరి ఆధ్వర్యంలోనే జరగనున్నాయి. డీసీలు,పీసీల సలహాల మేరకు పెద్ద పనులపై అధికారులు నిర్ణయం తీసుకుంటారు.

అసెంబ్లీ	పనులు	నిధులు(కోట్లు)
అమలాపురం	107	3.5 కోట్లు
కాకినాడ రూరల్	53	1.9
కొత్తపేట	68	2.9
మండపేట	67	2.6
ముమ్మడివరం	85	3.4
పి.గన్నవరం	53	2.4
పెద్దాపురం	51	2.3
రామచంద్రపురం	79	2.9
రాజోలు	61	2.5
జగ్గంపేట	31	2.0
పిఠాపురం		3.9
అనపర్తి	31	1.17
కొవ్వూరు	28	2.02
రాజమండ్రి రూరల్	10	62.8 లక్షలు
ప్రత్తిపాడు	26	99.86 లక్షలు
రంపచోడవరం	3	23.99 లక్షలు
తుని	35	74.98 లక్షలు
గోపాలపురం	16	92.02 లక్షలు

మొత్తం 1742 పనులకు రూ.68.64 కోట్లతో పనులు ప్రతిపాదించారు. రెండు మూడు రోజుల్లో శాంక్షన్ ఉత్తర్వులు వస్తాయని ధవళేశ్వరం సర్కిల్ ఎస్ఈ గోపినాథ్ తెలిపారు. పనులన్నీ ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు, మంత్రుల సలహాలు, సూచనల మేరకు ప్రతిపాదించారు.



ధవళేశ్వరం వద్ద నిండుగా గోదావరి కాల్వ



రేపు కాలువల మూత

ధవళేశ్వరం సర్కిల్ పరిధిలో తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాలువలకు ఈనెల 27 నుంచి నీటి సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ నేపథ్యంలో కాలువల అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ధవళేశ్వరం గోదావరి పరిధిలోని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వ్యాప్తంగా 33 నియోజకవర్గాల్లో రూ.68.64 కోట్లతో 1747 పనులు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రెండు మూడు రోజుల్లో వాటికి అనుమతి తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేయనున్నారు.ఉత్తర్వులు వచ్చిన వెంటనే కాలు వల్లో నీరు తగ్గిన తర్వాత నీటి సంఘాలు పనులు చేపడతాయి.అసెంబ్లీ నియోజకవర్గాల వారీ పనులు గుర్తించారు. అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పంట కాలువలు, పిల్లకాలువలు సుమారు 4 వేల కి.మీ మేర ఉంటాయి.

19 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు మే 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు సొసైటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. 24 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొంది. పరీక్షా కేంద్రాలు కేటాయించాలని ప్రభుత్వ పరీక్షల విభాగానికి లేఖ రాసినట్టు తెలిపింది. మే 26 నుంచి 30 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్టు పేర్కొంది.

ఏపీఈఏపీ సెట్ ప్రవేశపరీక్షకు 3,58,017 దరఖాస్తులు

మెయిన్‌లో..

- ఇంజనీరింగ్ 2,77,507, అగ్రికల్చర్, ఫార్మశీ 79,610
- అపరాధ రుసుంతో మే 16 వరకు దరఖాస్తుకు అవకాశం
- జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ వెల్లడి

అంతా యాపారం!

- వ్యాపార ధోరణితో స్కేటింగ్ రింక్ నిర్వహణ
- భారీగా శిక్షణ రుసుముల వసూలు
- రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ తీరుపై విమర్శలు



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ వివేకానంద పార్కు ఆవరణలో రూ.9కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో స్కేటింగ్ రింక్‌ను గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ స్కేటింగ్ రింక్ నిర్వహణకు స్మార్ట్ సిటీ అధికారులు టెండర్లు పిలిచారు. అంతకుముందు వైసీపీ హయాంలో రెండేళ్లపాటు అసోసియేషన్ సభ్యులు స్కేటింగ్ శిక్షణ కోసం పెద్ద మొత్తంలో వసూళ్లు సాగించారు. పూర్వం నుంచి ఈ ప్రదేశంలో తక్కువ విస్తీర్ణంలో స్కేటింగ్ రింక్ ఉండేది. దీన్ని నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులకే నూతనంగా నిర్మించిన భారీస్కేటింగ్ రింక్‌ను అప్పగించారు. కార్పొరేషన్‌కు ఏమీ చెల్లించకుండానే రింక్ నిర్వహణ అసోసియేషన్‌కు అప్పగించేలా ఓ ప్రజాప్రతినిధి వ్యవహారం నడిపారు. అప్పట్లో అసోసియేషన్ నిర్ణయించిన రేట్లనే చెల్లించి సభ్యత్వం తీసుకోవాల్సిన పరిస్థితి స్కేటింగ్ క్రీడాకారులకు ఏర్పడింది. స్కేటింగ్ క్రీడకు సంబంధించిన డ్రెస్, షూస్ వంటివి అక్కడే కొనుగోలు చేయాలనే నిబంధన విధించి జేబులు నింపుకొన్నారు. ఈ సమయంలో కరెంటు చార్జీలు కార్పొరేషనే చెల్లించింది. రింక్ ఆవరణలో పరిశుభ్రత పనులు కార్పొరేషన్ సిబ్బందితోనే చేపట్టేవారు. నిర్వహణ ప్రైవేటు వ్యక్తులపరమైనా.. నిర్వహణభారం కార్పొరేషనే భరించింది. కూటమి ప్రభుత్వం రాకతో ఈ బండారం బయట పడింది. దీంతో మేల్కొన్న కార్పొరేషన్ సిబ్బంది ఈ వ్యవహారాన్ని సరిదిద్దేందుకు టెండర్ పిలిచారు. అసోసియేషన్ సభ్యులే పాటలో ఈ రింక్‌ను దక్కించుకున్నారు. వాస్తవానికి స్మార్ట్‌సిటీ అధికారులు రూ.పది లక్షల లక్ష్యం పెట్టుకుంటే.. అంతకు రెట్టింపు హెచ్చుపాటకు వెళ్లింది. అప్పటికే రింక్ ద్వారా వచ్చే ఆదాయం రుచి మరిగిన అసోసియేషన్ పెద్దలు ఏడాదికి రూ.25.66 లక్షలు చెల్లించేలా పాటను దక్కించుకున్నారు. అంతకుముందు రెండేళ్లకుపైగా వసూలు చేసిన మొత్తంలో కార్పొరేషన్‌కు చెందాల్సిన సొమ్మును వెనక్కి రాబట్టే ప్రయత్నం మున్సిపల్ సిబ్బంది చేయలేదు. అప్పట్లో వాడుకున్న రెండేళ్లకు అసోసియేషన్ నుంచి రూ.40లక్షలైనా రాబట్టాల్సి ఉంది.

ఆ నాలుగు నెలల సొమ్ము ఏమైనట్టు..

కాకినాడలో రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ చాలా ఏళ్లగా ఉంది. క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అసోసియేషన్ సభ్యులే వ్యాపార ధోరణిలోకి మారిపోయారనే విమర్శలున్నాయి. స్కేటింగ్ రింక్‌ను 2024, మార్చి 6న ప్రారంభించారు. ఎన్నికల కోడ్ రావడంతో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాలేదు. టెండర్లు కూడా పిలిచే అవకాశం లేకుండా పోయింది. ఈలోపు అసోసియేషన్ సభ్యులు రింక్‌ను తమ అధీనంలోకి తీసుకున్నారు. మార్చి, ఏప్రిల్, మే, జూన్ వరకు నాలుగు నెలలపాటు స్కేటింగ్ శిక్షణను కొనసాగించారు. ఈ సమయంలో భారీ మొత్తంలో క్రీడాకారులనుంచి సొమ్ములు వసూలు చేసినట్టు తెలుస్తోంది. రెగ్యులర్‌గా వచ్చే క్రీడాకారులు ఇక్కడ 200మంది ఉంటే వారినుంచి నెలకు రూ.2వేలచొప్పున అంటే నెలకు రూ.4లక్షలు.. నాలుగు నెలలకు రూ.16లక్షల వరకు రాబట్టారు. అదే ఏడాది సమ్మర్ క్యాంపుల పేరుతో 500మంది క్రీడాకారులనుంచి రూ.2,500 చొప్పున మొత్తం రూ.12.50 లక్షలు వసూలు చేశారని సమాచారం. జూన్ 2024లో జరిగిన జోనల్ మీట్‌కు మూడు జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చారు. వారినుంచి రూ.500 ఫీజు చొప్పున రూ.3లక్షలు కలెక్ట్ చేశారు. బయట జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునేందుకు గంటకు రూ.200 చొప్పున రూ.లక్షన్నర వరకు వసూలు చేశారు. క్రీడాకారులకు గుర్తింపుకార్డుల కోసం ఒకొక్కరి నుంచి రూ.వెయ్యి చొప్పున 700మంది నుంచి రూ.7 లక్షలు వసూలు చేశారు.

పదేళ్లుగా వారే సభ్యులుగా..

ప్రతి రెండు, మూడేళ్లకు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యవర్గం మారాలి. పదేళ్లుగా అదే కార్యవర్గం కొనసాగుతోంది. అసోసియేషన్‌లో ఓ కీలక సభ్యుడు సంఘం సొమ్ములు పెద్దమొత్తంలో వాడుకొని చేతులెత్తేసినట్టు తెలిసింది. దీనిపైనా, అసోసియేషన్‌లో ఇతర వ్యవహారాలపైనా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ దృష్టిసారించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

30తో గడువు ముగింపు

- ఆస్తిపన్ను చెల్లింపులకు 17 ప్రత్యేక కౌంటర్లు: కాకినాడ కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను బకాయిలపై విధించిన వడ్డీ 50శాతం రాయితీ, 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తం పన్నుపై ఐదు శాతం తగ్గింపు(రిబేటు) గడువు ఈనెల 30న ముగుస్తున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన శుక్రువారం తెలిపారు. ఇందుకుగాను నగరంలో 17 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు.

పన్ను చెల్లింపు ప్రత్యేక కేంద్రాలు

సీఅండ్‌సీ థియేటర్ ఎదురుగా పాత మున్సిపల్ కార్పొరేషన్‌ఆఫీసు, శారదాదేవి గుడివద్ద ఉన్న కార్పొరేషన్ బిల్డింగ్ రెండో అంతస్తులోని రెవెన్యూ సెక్షన్, వైద్యనగర్ సచివాలయం ఒకటి, కేఎస్‌సీసీఎల్, రాజరామ్మోహన్‌నగర్ సచివాలయం-2, సీతారామనగర్ సచివాలయం, పావురాల తూము సచివాలయం-1, యానాం రోడ్డు సచివాలయం-1, తూరంగిపేట సచివాలయం, న్యూమున్సిప్స్ జంక్షన్ సచివాలయం-2, తిలక్ స్ట్రీట్ సచివాలయం, సుభాష్ సచివాలయం-2, రామారావుపేట సచివాలయం-1, రామారావుపేట సచివాలయం-5, మెహర్ నగర్ సచివాలయం-1, నరసన్న నగర్ సచివాలయం-1, జెట్ల పెద్దకాపు వారి స్ట్రీట్ సచివాలయం-1



ఊరిస్తోంది..

ఊరగాయ!



వేసవికాలం వచ్చిందంటే గోదావరి జిల్లాల్లో ఊరగాయల సందడి వచ్చేస్తుంది. ముఖ్యంగా ఆవకాయకు కేరాఫ్ అడ్రస్‌గా రాజమహేంద్రవరం ఉంటుంది. ఇతర ప్రాంతాలతో పోల్చితే రాజమహేంద్రవరం పరిసర గ్రామాల్లో మామిడి పంట అధికంగా ఉండడమే కారణం. మామిడితోపాటు టమాట, మిర్చి ఆవకాయ, దబ్బకాయ, నిమ్మకాయ, ఉసిరికాయ, ములక్కాయ, గోంగూర, కొత్తిమీర, పచ్చళ్లు ఎండాకాలంలోనే పట్టడానికి అనుకూలం. అందుకే వేసవికాలం ఊరగాయల కాలం అని మన పెద్దలు అంటుంటారు.

- ఎక్కడ చూసినా పచ్చళ్ల హడావుడే.. మార్కెట్‌లో అంతా ఇదే సందడి
- పచ్చడి రకం మామిడికాయ రూ.10 నుంచి రూ.25 వరకు ధర

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలు అమితంగా ఇష్టపడే ఆహార పదార్థాల్లో పచ్చళ్లు కూడా చాలా ముఖ్యం. వేసవికాలంలో పచ్చళ్లు పడితే మూడు కాలాలపాటు అవి నిలిచి ఉండి మళ్లీ పచ్చళ్లు పట్టే సమయానికి జాడీలు అడుగంటుతాయి. ఆ విధంగా నాన్నమ్మలు, తాతమ్మలు, అమ్మమ్మలు పచ్చళ్లను నిల్వ చేసుకునేలా సిద్ధం చేసేవారు. అందుకే వేసవి ఆరంభంతోనే పచ్చళ్ల సందడి ప్రతి ఏటా మొదలవుతుంది. రాజమహేంద్రవరం ఆవకాయపచ్చడి మార్కెట్లు చాలా ప్రసిద్ధి. పచ్చడి సరుకులన్నీ హోల్‌సేల్ ధరలకే ఇక్కడ లభ్యమవడం, అన్ని రకాల పచ్చడి మామిడికాయ కూడా పెద్దఎత్తున దిగుమతి కావడంతో సమీప ప్రాంతాల నుంచి ఈ సీజన్‌లో మార్కెట్‌కు తరలివస్తారు. పట్టిన పచ్చళ్లు కొనుగోలు చేసుకునే సంస్కృతి పెరుగుతున్నా ఇప్పటికీ అన్ని రకాల నాణ్యమైన దినుసులతో, గానుగ నూనెతో ఊరగాయలు పట్టడానికే ఎక్కువమంది మొగ్గుచూపుతున్నారు. పాత పద్ధతినే అనుసరిస్తూ కష్టమైనా పచ్చడి పట్టుకుని తమతోపాటు బంధుమిత్రులకు పంపించే పరిస్థితీ కొనసాగుతోంది. ధరలు అంతకంతకూ పెరుగుతుండడంతో తక్కువ పరిమాణంలోనైనా ఆవకాయ, మాగాయ పట్టుకోవాలని చాలామంది ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సగటున 25 మామిడికాయలు కొనుగోలు చేసుకుని వాటిలోకి పచ్చడి మిరపకాయలు కిలో రూ.300కు కొనుగోలు చేసి వాటిలోకి నువ్వుల నూనె లేదా వేరుసెనగ నూనెను వాడుకునేలా సిద్ధం చేసుకోవడంతోపాటు వెల్లుల్లి, ఆవాలు, మెంతులు తదితర పచ్చడి దినుసులన్నీ కొనుగోలు చేసుకోవడానికి మొత్తం రూ.3 వేల వరకు ఖర్చవుతోంది.

మార్కెట్ యార్డుకు పోటెత్తుతున్న మామిడి



ఆవకాయ పేరుచెబితే మామిడితో కొన్ని రకాల కాయలకు ప్రత్యేకమైన డిమాండ్ ఉంటుంది. రాజమహేంద్రవరం మార్కెట్‌లో ఆవకాయ, మాగాయ, తొక్కుడు, బెల్లం ఆవకాయ పచ్చళ్లకు అవసరమైన మామిడికాయలు అందుబాటులో ఉన్నాయి. ఆవకాయకు కొత్తపల్లి కొబ్బరి బాగా ఫేమస్. ఆ తర్వాత నీలాలు, రసాలను వినియోగిస్తారు. ప్రస్తుతం మార్కెట్‌కు ఆయా రకాల మామిడికాయలు చేరుకుంటున్నాయి. అయితే రాజమహేంద్రవరం మార్కెట్‌కు దూర ప్రాంతాల నుంచి మామిడికాయలను దిగుమతి చేసుకునే అవసరం లేదు. ఎందుకంటే తూర్పుగోదావరి జిల్లాలోనే గోకవరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లోనే పెద్దఎత్తున మామిడి తోటలు ఉన్నాయి. ఈ తోటల నుంచే మామిడి కాయలు రాజమహేంద్రవరం మార్కెట్ యార్డుకు ప్రతి ఏటా తరలివస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో సరుకు దిగుమతి ఊపందుకుంది. ప్రస్తుత మార్కెట్‌లో పచ్చళ్లకు వినియోగించే మామిడి కాయల ధరలు కాయ రూ.10 మొదలుకొని రూ.25 వరకు ఉంది. రకాలు, వాటి నాణ్యతను బట్టి రేట్లు పెరుగుతున్నాయి. కొత్తపల్లి కొబ్బరి మామిడి కాయ ఒకటి రూ20 వరకు పలుకుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చడి కాయల సందడి కూడా మొదలైంది. మే మొదటి వారంలో మరింతగా పచ్చడి కాయలకు డిమాండ్ పెరగనుంది. ఇప్పటికే కాయలు కొనుగోలు చేసుకుని వాటిని ముక్కలు కొట్టే వారి వద్దకు తీసుకుని వెళ్లి నచ్చిన సైజులో ముక్కలు కొట్టించి పచ్చడి పట్టుకునే పనిలో మహిళలు నిమగ్నమయ్యారు.



హామీ నెరవేర్చారు!

నాయీబ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25 వేలు.. జీవో జారీచేసిన ప్రభుత్వం

అన్నవరం దేవస్థానంలో 74 మంది నాయీబ్రాహ్మణులకు శుభవార్త

అన్నవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో కేశఖండనశాల నాయీబ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం తీపికబురు అందించింది. దేవస్థానంలో 74 మంది నాయీబ్రాహ్మణులుండగా వీరికి దేవస్థానం నుంచి రూ.20వేల వేతనం అందిస్తున్నారు. చంద్రబాబు ఎన్నికల హామీల్లో భాగంగా ఈ వేతనాన్ని రూ.25వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పెంచిన జీతాలు జూన్ నుంచి అమలులోకి రానున్నాయి. మొదట్లో నాయీబ్రాహ్మణులు కేశఖండన టిక్కెట్లపై వచ్చే కమిషన్‌తో విధులు నిర్వహించేవారు. మొదట్లో రూ.2 కమిషన్ ఉండగా క్రమేపీ రూ.25కి పెంచారు. వైసీపీ ప్రభుత్వం దాన్ని రూ.20 వేల వేతనంగా మార్చగా, కూటమి ప్రభుత్వం రూ.25వేలకు పెంచింది.

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును సత్కరిస్తున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ నాయీబ్రాహ్మణులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల్లో నాయీబ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అమలుచేశారు. ఎన్నో ఏళ్లుగా దేవుడి సేవలో ఉంటూ నాయీబ్రాహ్మణ వృత్తినే కొనసాగిస్తూ వస్తున్న వారికి రూ.25 వేలు కనీస వేతనంగా అమలుచేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని జీవో జారీచేసింది. ఈ జీవోపై నాయీబ్రాహ్మణులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. రూ.50లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ ఆదాయం వచ్చే 44 దేవాలయాలు 'ఏ' కేటగిరిలో ఉన్నాయి. వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం డిప్యూటీ కమిషనరు హోదాకు చేరుకుంది. వార్షిక ఆదాయం రూ.30 కోట్లపైమాటే. గతంలో శ్రీ వేంకటేశ్వర నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సుమారు 17 మంది ఎన్నో ఏళ్లుగా భక్తులకు తలనీలాలు తొలగించే సేవలో కొనసాగారు. గతంలో టిక్కెట్టు రూ.25కు తలనీలాల సమర్పించే భక్తుల నుంచి సేకరించగా ఆ టిక్కెట్టు కమిషను రూ.25 నాయీబ్రాహ్మణులకు అందించేవారు. ఇలా నెలకు రూ.7వేల నుంచి రూ.8 వేల ఆదాయం వచ్చేది. ఆ కమిషన్‌తోనే కుటుంబాలు పోషించుకునేవారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీరి సేవలను గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం దృష్టికి తీసుకునివెళ్లడంతో గత ప్రభుత్వం రూ.20 వేల వేతనం అందించింది. దీన్ని కూటమి ప్రభుత్వం రూ.25 వేల వేతనానికి పెంచుతూ తాజాగా జీవో జారీచేసింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావును వీరంతా సత్కరించారు.





కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఎన్నో ఏళ్లుగా దేవుడి సేవలో నిమగ్నమై ఉన్న తమకు కనీస వేతనం కోసం పోరాటం సాగించాం. చాలీచాలని వేతనాలతో దేవుడినే నమ్ముకుని భక్తులకు సేవలందిస్తూ వచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం రూ.25 వేలు కనీస వేతనం పెంచుతూ జీవో జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నాం. - రౌతు సురేష్,
వెంకటేశ్వర నాయీబాహ్మణ సంఘ అధ్యక్షుడు, వాడపల్లి

ఈనెల 29 నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలు

- జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నరసింహారావు



దివాన్‌చెరువు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 29 నుంచి రెండు రోజులపాటు వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తూర్పుగోదావరిజిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గుంటూరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాంఫాం ఆడిటోరియంలో వర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ వజ్రోత్సవాలకు ముఖ్యఅతిథులుగా గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హాజరవుతారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని శాస్త్రవేత్తలు అందరూ పాల్గొంటారని తెలిపారు. తొలి రోజు వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో అంతర్జాతీయంగా చోటుచేసుకొంటున్న మార్పులు గురించి సదస్సు జరుగుతుందన్నారు. రెండో రోజున 30వ తేదీన అభ్యుదయ రైతులతో వ్యవసాయ వర్సిటీ ద్వారా 60 సంవత్సరాల నుంచి రూపొందించిన కొత్తవంగడాలు, సాంకేతిక పరిజ్ఞానంపై చర్చ జరుగుతుందని తెలిపారు. రైతులు, వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చదివిన పూర్వ విద్యార్థులు ఈ అవకాశంను వినియోగించుకోవాలని నరసింహారావు విజ్ఞప్తి చేశారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా

ఓఎన్జీసీ చమురు తరలించుకుపోతోంది

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనందసాగర్

కాకినాడసిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రాంతంలోని స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఓఎన్జీసీ పైప్‌లైన్ల ద్వారా చమురు నిక్షేపాలను తరలించుకుపోతోందని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్ మండిపడ్డారు. ఈమేరకు శుక్రవారం విడుదలచేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ కోనసీమజిల్లా అమలాపురం నియోజకవర్గం ఓడలరేవు గ్రామంలోని ఓఎన్జీసీ టెర్మినల్ దగ్గర కోనసీమ నిరుద్యోగ యువత ఆధ్వర్యంలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని నిరసన దీక్షలు చేపట్టి కొనసాగిస్తున్నారన్నారు. దీనిపై ఓఎన్జీసీ స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉదాసీనంగా వ్యవహరిస్తూ తన అధికారాన్ని, బలాన్ని ఉపయోగించి ఏదోవిధంగా దీక్షా శిబిరాన్ని ఎత్తివేయించాలని ప్రయత్నిస్తోందన్నారు. ఈ విధమైన ఓఎన్జీసీ వైఖరిని తెలుగు దేశంపార్టీ తీవ్రంగా తప్పుపడుతోందని, స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని బలంగా డిమాండ్ చేస్తోందన్నారు. కొన్ని దశాబ్దాలుగా కోనసీమ సముద్రతీరంలోని సంపదనంతా ఓఎన్జీసీ తవ్వుకుని ఎత్తుకుపోతోందని, పైప్‌లైన్ల ద్వారా సముద్రగర్భం నుంచి తరలించుపోతోంద న్నారు. కోనసీమ నిరుద్యోగ యువత మంచితనాన్ని చేతకానితనంగా భావిస్తే ఓఎన్జీసీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈసారి ఇక్కడున్న పార్లమెంట్ సభ్యుడికి చమురు సహజ నిక్షేపాల అథారిటీలో డైరెక్టర్ పదవి ఇవ్వకుండా ఎక్కడో బందరులో ఉన్న పార్లమెంట్ సభ్యుడికి ఈ పదవి ఇచ్చారన్నారు. ఆయిల్, గ్యాస్ పట్టుకుపోయేది ఇక్కడి నుంచేనని, స్థానిక పార్లమెంట్ సభ్యుడికి ఈ కమిటీలో డైరెక్టర్ పదవి ఇవ్వకపోవడం ఎంతో అవమానమన్నారు.

పచ్చని గొడుగులా...

- గోకవరం-రంపయర్రంపాలెం రహదారి

గోకవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎండ వేడిమి ఎక్కు వగా ఉన్నపుడే చెట్టు విలువ తెలుస్తోంది. కాసేపు ఆ చెట్టు కింద సేదతీరి తిరిగి ప్రయాణం కొనసాగించాలనిపిస్తోంది. గోకవరం-రంపయర్రంపాలెం ప్రధాన రహదారిలో వెళితే ఇదే అనుభూతి కలుగక మానదు. ఆ రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పచ్చనిచెట్లు ప్రయాణికులకు ఎంతో ఉపసమనాన్ని కల్గిస్తున్నాయి. సాయంత్రం వేళ ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి.



గోకవరం-రంపయర్రంపాలెం రహదారి మధ్యలో పచ్చని చెట్లు

కంచి విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు

- రేపు కాకినాడ చల్లా కల్యాణ మండపంలో అవగాహన సదస్సు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కంచిలోని కామకోటి యూనివర్శిటీకి చెందిన చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కంచి పీఠం ప్రతినిధి, వేద పురోహితులు ఆకెళ్ల మురళీకృష్ణశర్మ తెలిపారు. దీని నిమిత్తం యూనివర్శిటీ విశ్వవిద్యాలయ యాజమాన్య, అధ్యాపకులతో ఈనెల 27వ తేదీన కాకినాడ విద్యుత్‌నగర్‌లో ఉన్న చల్లా కల్యాణ మండపంలో ఉదయం 10నుంచి 5గంటల వరకు అవగాహన సదస్సులో చేరేందుకు ప్రవేశాల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. శుక్రవారం చల్లా కల్యాణమండపంలో ఆకెళ్ల మురళీకృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ధర్మం ఎలా ఉండాలో జీవితంలో ఎలా ఉన్నతస్థితికి చేరాలనేది, క్రమశిక్షణకు సంబంధించి విద్యను నేర్పుతారన్నారు. ఇంజినీరింగ్ విద్యతోపాటుగా ఇంకా ఎంసీఏ, ఎంబీఏ, ఎంటెక్ వంటి విద్యను బోధిస్తారన్నారు. విద్యార్థులకు ఉపకరణాలు హాస్టల్ వంటి సదుపాయాలు ఈ కంచి పీఠం ఆధ్వర్యంలో జరిగే ఈ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల్లో విద్యను అభ్యసించడం ద్వారా ధర్మం, మంచి అలవాట్లు కలుగుతాయన్నారు. తద్వారా వారు ఉన్నత స్థితికి చేరి ఉద్యోగంలో రాణించవచ్చని చెప్పారు. తిరుపతిలో కంచి పీఠం ఆధ్వర్యంలో పాఠశాలలో బ్రాహ్మణ బాలికలకు ఉచిత విద్యనందిస్తున్నట్లు తెలిపారు. కంచి ఆధ్వర్యంలో సీబీఎస్ సిలబస్ చెన్నై, పొదిలి ఇంకా తెలంగాణ వంటి ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలో విద్యను బోధిస్తున్నట్లు మురళీకృష్ణ చెప్పారు. కంచి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు చేరి తమ ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకెళ్ల మురళీకృష్ణ తెలిపారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ సంఘం నాయకులు చల్లా నిరంజన్ శ్రీనివాస్, దేవత పుత్రరావు, ఎస్.శ్రీరామచంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేద పురోహితులు ఆకెళ్ల మురళీకృష్ణశర్మ

రండి కలిసి పనిచేద్దాం

- వర్మ చేయి పట్టుకుని తీసుకుని వెళ్లిన డిప్యూటీ సీఎం పవన్
- పిఠాపురంలో ఆసక్తికర సన్నివేశం

పిఠాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన సందర్భంగా శుక్రవారం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలువద్ద ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం, వ్యవసాయ పనిముట్లు పంపిణీ కార్యక్రమానికి వచ్చిన పవన్ అక్కడేఉన్న వర్మనుచూసి ఆగి చేయిపట్టుకుని లోపలకు తీసుకువెళ్లారు.శిక్షణ ప్రారంభానికి సూచికగా రిబ్బన్‌కట్‌చేసే సమయంలో ఎంపీ ఉదయశ్రీనివాస్‌తోపాటువర్మను రిబ్బన్ పట్టుకోవాలని సూచించారు. నియోజకవర్గాభివృద్ధికి ఎంపీ ఉదయ్, వర్మ, జనసేన నేతలు కలిసి పనిచేస్తామని పవన్ ప్రకటించారు.



పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే వర్మ చేయి పట్టుకుని తీసుకుని వెళ్తున్న పవన్‌కల్యాణ్

టెన్త్, సివిల్స్ టాపర్లకు పవన్ అభినందన



టెన్త్ టాపర్‌గా నిలిచిన నేహాంజని, జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని తోట పుష్పాంజలిలను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం



సివిల్స్‌లో 94వ ర్యాంకు సాధించిన చక్కా స్నేహిత్‌ను అభినందిస్తున్న పవన్‌కల్యాణ్

పిఠాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో 600కి 600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రికార్డు సృష్టించిన కాకినాడకు చెందిన యాళ్ల నేహాంజనిని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అభినందించారు. పిఠాపురం పర్యటనలోఉన్న పవన్‌ను ఆమె కలిసింది. గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని తోట పుష్పాంజలి టెన్త్ పరీక్షల్లో 594 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో కాకినాడ జిల్లాలో రెండో ర్యాంకులో నిలిచారు. పుష్పాంజలిని పవన్ అభినందించారు. ఇద్దరు భవిష్యత్తులో ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆశీర్వదించారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందనలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్స్‌లో 94వ ర్యాంకు సాధించిన పిఠాపురం పట్టణానికి చెందిన చక్కా స్నేహిత్‌ను పవన్‌కల్యాణ్ అభినందించారు. పిఠాపురంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలువద్ద పవన్‌ను అతడు కలిశారు. సివిల్స్‌లో ర్యాంకు సాధించడం ముదావహమన్నారు.

నా కుమార్తెను కాపాడరూ



కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కుమార్తెను ఆదుకోవాలని కోరుతున్న దంపతులు

- డిప్యూటీ సీఎంను కలిసేందుకు వచ్చిన దంపతులు

పిఠాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం చొరవ తీసుకుని తమ కుమార్తెను కాపాడాలని ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సూర్య దంపతులు కోరారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కుమార్తెను తీసుకుని వారు పిఠాపురం వచ్చారు. పవన్ కలిసే అవకాశం లభించకపోవడంతో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.

ఇన్సెంటివ్ బకాయిలు విడుదల చేయరూ

పట్టురైతులకు ఐదేళ్లనుంచి రావాల్సిన రూ.3కోట్ల ఇన్సెంటివ్ బకాయిలను తక్షణం విడుదల చేయాలని పట్టు రైతులు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కోరారు. పట్టు రైతులకు గతంలో అమలులో ఉన్న రాయితీలు అన్నింటినీ పునరుద్ధరించాలని, రవాణా చార్జీలను చెల్లించాలని, దళారులవల్ల మోసపోయి న రైతులకు రూ.34లక్షల సొమ్ము ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

రెల్లి కులస్తులకు న్యాయం చేయాలి

ఎస్సీ వర్గీకరణలో భాగంగా రెల్లి, ఉపకులాలుకు కేవలం 1శాతం రిజర్వేషన్ కేటాయించడం అన్యాయమని రెల్లికులరిజర్వేషన్ సాధన సమితి ప్రతినిధులు అన్నారు. కనీసం 2 నుంచి 3శాతం రిజర్వేషన్‌ను ప్రత్యేకంగా రెల్లి కులానికి కేటాయించాలని, రెల్లి కులస్తుల అభి వృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

రచ్చబండ రద్దు

- వినతుల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు

పిఠాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొనాల్సిన రచ్చబండ కార్యక్రమం రద్దయింది. దీంతో వివిధ సమస్యలపై వినతులు ఇద్దామని వచ్చిన ప్రజలు నిరాశకు గురయ్యారు. వారినుంచి వినతలు స్వీకరించేందుకుగాను పిఠాపురం ప్రభుత్వాసుపత్రివద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. వారి నుంచి వినతులు తీసుకుని రశీదులు ఇచ్చారు.



వినతుల స్వీకరణకు ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

పిఠాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పట్టణ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అక్కడి భాస్కర్‌నగర్‌లో నూతనంగా నిర్మించతలపెట్టిన కల్యాణ మండపం శంకుస్థాపన ఆహ్వానపత్రికలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కాకినాడ ఎంపీ ఉదయశ్రీనివాస్, శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆవిష్కరించారు.



కల్యాణమండపం శంకుస్థాపన ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

రేపు తిరుమలలో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో తిరుమల విద్యాసంస్థల్లో ఆదివారం 6,7,8,9,10 తరగతుల్లోకి రాబోయే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తిరుమల విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామని ఆ సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తిరుమల క్యాంపస్‌లో ఈనెల 27న ఉదయం 10నుంచి సదస్సు జరుగుతుందని, తమ పిల్లల భవిష్యత్‌లో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి కళాశాలలో విద్యనభ్యసించాలంటే స్కూల్‌స్థాయి నుంచే ఎలా సంసిద్ధమవ్వాలో ఈ సదస్సులో వివరిస్తారని తెలిపారు. సమాచారంకోసం 7997071672, 8309076048ను సంప్రదించాలని కోరారు.

రెండోరోజు కొనసాగిన ఉపాధ్యాయుల ధ్రువపత్రాల జారీ

కాకినాడక్రైం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో భాగంగా శుక్రవారం రెండోరోజు ఉపాధ్యాయులకు కాకినాడ జీజీహెచ్‌లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో బదిలీ కోరుకునే ఉపాధ్యాయులకు జీజీహెచ్‌లో జనరల్ మెడిసిన్, గుండె, కంటి, న్యూరో, ఆర్థో, మానసిక వైద్య విభాగాలకు చెందిన వైద్యుల పర్యవేక్షణలో ఉపాధ్యాయులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులుకు వైద్య ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంవో డాక్టర్ లావణ్య, సీఎస్ఆర్ఎంవో రాజకుమారిలు పాల్గొన్నారు.

వెటర్నరీ డాక్టర్లు... మూగజీవాల దైవాలు!

నేడు ప్రపంచ పశువైద్య దినోత్సవం

కాకినాడ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలైన పశు, జంతు సంరక్షణలో పశు వైద్యుల (వెటర్నరీ డాక్టర్ల) పాత్ర కీలకం. ఈ ఏడాది ఏప్రిల్ నెల నాల్గో శనివారం పశు వైద్య దినోత్సవం. ఈ రోజున పశు, జంతువుల ఆరోగ్యం, సంరక్షణ ముఖ్యంగా జంతు హింసను నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన పెంచడమే లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహిస్తారు. పెంపుడు జంతువుల సంరక్షణకు సంబంధించిన అనేక అంశాలపై పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కల్పిస్తారు.

ఎప్పుడు ప్రారంభం..

1863వ సంవత్సరంలో మొట్టమొదటి సారిగా యూరోపియన్ వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జాన్‌జామ్‌జీ వెటర్నరీ కాలేజీలో ఈ వరల్డ్ వెటర్నరీ డేను నిర్వహించారు. అనంతరం 1959లో మాడ్రిడ్‌లో వరల్డ్ వెటర్నరీ అసోసియేషన్ స్థాపించారు. ప్రస్తుతం 70 కంటే ఎక్కువ ప్రపంచ దేశాలు వెటర్నరీ అసోసియేషన్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అనంతరం 2001 సంవత్సరంలో ప్రపంచ వెటర్నరీ అసోసియేషన్ ఏప్రిల్ నాల్గో శనివారం నాడు ఈ పశు వైద్య దినోత్సవాన్ని జరుపుకునేందుకు నిర్ణయించింది.

ఇదే లక్ష్యం...

ప్రపంచ పశు వైద్య దినోత్సవం లక్ష్యం వెటర్నరీ సైన్సులో యువత ప్రత్యేక శ్రద్ధ వహించి నైపుణ్యతను పెంపొందించుకోవాలి. ముఖ్యంగా ఎవరూ పట్టించుకోని జంతువులకు జీవన పరిస్థితులను కల్పించి వాటి ఎదుగుదలను వెటర్నరీ వైద్యులు మెరుగుపరుస్తున్నారు. జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులపై, అలాగే పెంపుడు జంతువులకు రోగనిరోధక శక్తిని ఎలా అందించాలో తదితర అంశాలపై అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు, ప్రమాదం పాలై గాయపడినప్పుడు వాటికి చికిత్సను అందజేయడంలో పశు వైద్యుని పాత్ర కీలకం. జంతువుల ఆరోగ్యాన్ని కాపాడడంలో పశు వైద్యుల పాత్ర మానవ శ్రేయస్సుపై ప్రభావంచూపుతుంది.

పశు వైద్యుల సేవలు అభినందనీయం



పశువులు, పెంపుడు జంతువులు, పౌల్ట్రీఫారంలలో వచ్చే సీజనల్ వ్యాధులు, అనారోగ్యాలు, ప్రమాదాల పరంగా ఏర్పడే గాయాలకు చికిత్సను అందించడంలో వెటర్నరీ డాక్టర్‌లు దైవాలతో సమానం. కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఆవులు 76,502 ఉండగా గేదెలు 2,82,273 ఉన్నాయి. అలాగే గొర్రెలు 1,41,229 ఉండగా మేకలు 1,01, 870 ఉన్నాయి. అలాగే పౌల్ట్రీకి సంబంధించి బ్రాయిలర్, ఫారం కోళ్ళు కలిపి 92,48,636 ఉన్నాయి. అలాగే 33,726 పెంపుడు కుక్కలు ఉన్నాయి. వీటన్నింటికి వైద్యచికిత్స, సేవలు అందిస్తున్న పశు వైద్యుల సేవలు అభినందనీయం.

డాక్టర్ వెంకటేశ్వరరావు జాయింట్ డైరెక్టర్, పశు సంవర్ధకశాఖ, కాకినాడ

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.26 కోట్లు



హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవస్థానం చైర్మన్, ఈవో

అన్నవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1,26, 07,501 నగదు, 50.100 గ్రాముల బంగారం, 950 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యూఎస్‌ఏకు చెందిన 215 డాలర్లు, యూరోలు 140, థాయిలాండ్‌కు చెందిన 140 బాట్‌లతో పాటుగా పలుదేశాల కరెన్సీ లభించాయి. ఈ లెక్కింపును సిబ్బంది చేపట్టగా ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించారు. 28 రోజులకు ఈ ఆదాయం సమకూరగా సరాసరిన భక్తులు రోజుకు రూ.4.50 లక్షలు కానుకల రూపంలో సమర్పించారు.

చంపుతామంటూ బెదిరించి దోపిడీ చేసిన నలుగురి అరెస్టు

పరారీలో మరో ఇద్దరు



కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో నిందితులు

కోటనందూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కాకరాపల్లి స్పైసీ హోటల్ వద్ద ఈనెల 22న తెల్లవారుజామున ఇద్దరు యువకులను చంపుతామంటూ బెదిరించి వారి వద్ద దోచుకొన్న వస్తువులతో పరారైన ఆరుగురు వ్యక్తుల్లో నలుగురుని కోటనందూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన అల్లాది నాగేంద్రసాయి, గాలంకి కిరణ్‌బాబు లంబసింగి విహారయాత్రకు వెళ్లి తిరివస్తుండగా కాకరాపల్లి వద్ద అరుగురు వ్యక్తులు రెండు స్కూటీలపై వచ్చి వారిని బ్యాట్‌తో అడ్డగించి చెంపపై కొట్టారు. వారి వద్ద ఉన్న బజాజ్ పల్సర్ బైక్, 2 మొబైల్ ఫోన్లు, దుస్తుల బ్యాగ్, రూ.1400 నగదు పట్టుకునిపోయారు. దీంతో బాధితులు పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. స్పెషల్ క్లూస్ టీం రంగంలోకి దిగి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల్లో కాకినాడకు చెందిన పట్టెంకామరాజు, గుటూరి సాయి దుర్గాప్రసాద్, సంగు నాగవెంకట భవాని కుమార్, చింతా పవన్‌కళ్యాణ్‌తో పాటు చల్లా నాగ శివమణికంఠ, ఏనుగుపల్లి రాజు ఉన్నారు. వారందరు శుక్రవారం అనకాపల్లి జిల్లా నాతవరం మండలం గాంధీనగరం- తాండవ జంక్షన్ మధ్య ఫారెస్ట్ టేక్ ప్లాంటేషన్ వద్ద గుమికూడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందింది. వెంటనే కోటనందూరు సీఐ జిచెన్నకేశవరావు, ఎస్ఐ టి.రామకృష్ణ, సీపీఎస్ ఎస్ఐ అంకబాబు ఆధ్వర్యంలో అక్కడకు వెళ్లి నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. ఏనుగపల్లిరాజు, చల్లా నాగశివ మణికంఠ పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన నిందితుల నుంచి పల్సర్‌బైక్ సుజుకీస్కూటీ, హోండా ఎక్టివా, నాలుగు మొబైల్‌ఫోన్లు, క్రికెట్ బ్యాట్, రూ.1400 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టుకు తరలించామని, మిగిలిన ఇద్దరిని కూడా త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు.

అమ్మ, నాన్న ఉండి.. అనాథలే!

- పట్టించుకోని తల్లి
- వదిలివెళ్లిపోయిన తండ్రి
- దీన స్థితిలో చిన్నారులు



చిన్నారులు తేజ కిరణ్, భానుప్రకాష్

రాజానగరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తల్లి వివాహేతర సంబంధం కారణంగా పట్టించుకోకపోవడం, ఆపై తండ్రి కూడా వదిలివెళ్లిపోవడంతో అందరూ ఉన్న అనాథలుగా కాలం వెళ్లదీస్తున్న చిన్నారుల హృదయ వేదన ఇది. వివరాల్లోకి వెళితే... తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంత మూరులోని చెంచుల కాలనీలో నివాసముంటున్న అన్నెపు ధనలక్ష్మి, జయరామ్ దంపతులకు తేజ కిరణ్(10), భానుప్రకాష్ (8) పిల్లలు ఉన్నారు. వారు రాజమహేంద్రవరంలోని నారాయణ స్కూల్లో 4,2 తరగతులు చదువుతున్నారు. తండ్రి జయరామ్ పెయింటింగ్ వర్కు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య ధనలక్ష్మి కర్రీ పాయింట్‌లో కేటరింగ్ పనులు చేస్తుండేది. ఈ క్రమంలో మండపల్లి ప్రవీణ్ కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి అది వివాహేతర బంధానికి దారితీసింది. ప్రియుడి మోజులో పడిన ధనలక్ష్మి ఇద్దరు పిల్లలను, భర్తను పట్టించుకోవడంలేదు. కూతురి ప్రవర్తన తీరును మందలించాల్సిన తల్లి తులసమ్మ.. అల్లుడు జయరామ్ బయటకు వెళ్లిపోయేలా చేసింది. ఏడాదిగా తల్లి వద్దనే ఉంటున్న చిన్నారులిద్దరితో ప్రియుడికి అవసరమైన సేవలు చేయించేది. తల్లి చెప్పిన పనులు చేయకపోతే ప్రియుడు ప్రవీణ్‌కుమార్ చిన్నారులను బెల్టు, వైర్లతో శరీరంపై తట్టులు వచ్చేలా కొడుతూ చిత్రహింసలకు గురిచేసేవాడు. దీంతో విషయం తెలుసుకున్న చిన్నారుల మేనమామ పాలవలస బాలమణికంఠ రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేసి రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రిలో చిన్నారులకు చికిత్స చేయించి, తన ఇంటికి తీసుకెళ్లాడు. 3 నెలలుగా మేనమామ సంరక్షణలో ఉంటున్న చిన్నారులిద్దరూ తమను నాన్న వద్దకు చేర్పించాలంటూ దీనంగా మేనమామను వేడుకుంటున్నారు. దీంతో మేనమామ బాలమణికంఠ చిన్నారులను వెంటబెట్టుకుని 3నెలలుగా రాజానగరం పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కడం దిగడం చేస్తున్నాడు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ నారాయణమ్మను శుక్రవారం ఫోన్‌లో సంప్రదించగా చిన్నారుల తండ్రి శ్రీకాకుళంలో ఉంటున్నాడు. ఒకటి, 2రోజుల్లో వస్తానన్నాడు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారులు ఎవరి వద్ద ఉంటామంటారో విన్న తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆమె బదులిచ్చారు.

కేశనకుర్రు టూ వైట్‌హౌస్

సీఐఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్‌గా కోనసీమ వాసి



ఐ.పోలవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అమెరికా సైబర్ సెక్యూరిటీ, మౌలిక సదుపాయాల భద్రతా సంస్థ (సీఐఎస్ఏ) డిప్యూటీ డైరెక్టర్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేశనకుర్రుకు చెందిన డాక్టర్ గొట్టుముక్కల మధు నియమితులయ్యారు. గొట్టుముక్కల వెంకటసూర్యానారాయణ రాజు(కొండరాజు), సత్యవాణి దంపతుల కుమారుడు మధుకు ఈ అరుదైన గౌరవం లభించడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అగ్రరాజ్యంలో మధు కీలక పదవిని సాధించడంపై తల్లిదండ్రులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

గోకవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గోకవరం గ్రామ శివారున నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై శుక్రవారం దాడి చేసినట్టు ఎస్ఐ వీఎన్‌వీ పవన్‌కుమార్ తెలిపారు. ఈదాడిలో నిర్వాహకురాలితో పాటు ఇద్దరు మహిళలను, ముగ్గురు విటులను అరెస్ట్ చేసినట్టు చెప్పారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపర్చనున్నామని తెలిపారు.

రామాలయంలో ఉత్సవ విగ్రహాల చోరీ

ఉప్పాడ నాయకర్ కాలనీ-1లో ఆలస్యంగా వెలుగులోకి ఘటన



ఆలయంలో చోరీకి గురవకుండా ఉన్న తోరణం

కొత్తపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీ-1లో శ్రీసీతారామస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఉత్సవ విగ్రహాలు అపహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయంలో నిత్యం పూజలు చేసే మల్లే మంగ తెలిపిన వివరాల ప్రకారం. నాయకర్ కాలనీలో పురాతన శ్రీసీతారామస్వామి ఆలయాన్ని పునఃనిర్మించి ఏప్రిల్ 15న విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. కాలనీలో ప్రతీరోజూ ఆలయంలో పూజలు చేస్తారు. నాలుగురోజుల కిందట ఆలయంలో పూజలు చేసుచేసేందుకు స్థానికుడు ఒకరు ఆలయం తాళం అడిగారు. పూజల అనంతరం ఆలయానికి వేసిన తాళాన్ని దగ్గర్లో ఉన్న బడ్డీకొట్టులో ఇచ్చి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయంలో స్థానిక సమస్యలపై పెద్దలు చర్చిస్తుండగా ఆలయంలో ఉత్సవ విగ్రహాలు లేకపోవడాన్ని గుర్తించారు. వెంటనే ఆలయం తలుపులు తీసి పరిశీలించేసరికి తోరణం, హనుమాన్ విగ్రహం తప్ప మిగిలిన ఉత్సవ విగ్రహాలను అపహరించడాన్ని గుర్తించారు. ఆలయం లో చోరీకి గురైన కంచు ఉత్సవ విగ్రహాల విషయంపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీకి గురైన ఉత్సవ విగ్రహాలు సుమారు రూ.50వేలపైగానే ఉంటాయని స్థానిక మత్స్యకారు పెద్దలు చెబుతున్నారు.



చోరీకి గురైన ఉత్సవ విగ్రహాలు (ఫైల్‌ఫొటో)

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన



మండపేటలో సత్తిబాబు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

మండపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పని ముగించుకుని ఓ వ్యక్తి ఇంటికి వెళ్తున్న సమయంలో బైక్ వేగంగా ఢీకొనడంతో మృతిచెందాడు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట గొల్ల పుంత కాలనీకిచెందిన మాదాబత్తుల సత్తిబాబు స్థానికంగా వెండి పట్టీల తయారీ దుకాణంలో పని చేస్తుంటాడు. గురువారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఓ బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన సత్తిబాబును మండపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్తిబాబు శుక్రవారం మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అతడికి భార్య, పిల్లలు వున్నారు. కుటుంసభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామని పట్టణ పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తు సహచర కార్మికులు, బంగారు దుకాణ వ్యాపారులు సత్తిబాబు మృతదేహంతో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కలువపువ్వు సెంటర్‌లో ఆందోళనకు దిగారు. మానవహారం చేపట్టారు. పట్టణ సీఐ దారం సురేష్ అక్కడకు చేరుకుని ఆందోళ కారులతో మాట్లాడి మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ప్రమాదానికి కారకుడైన వ్యక్తి గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని కోలుకున్న వెంటనే ఆదుపులోకి తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి



మరణించిన వ్యక్తి

తుని రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని వ్యక్తి మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. హంసవరం నుంచి అన్నవరం మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా ఓ రైలు ఢీ కొని వ్యక్తి మృతి చెందినట్టు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే మృతుడికి సంబంధించిన వివరాలు కానరాకపోవడంతో మృతదేహన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాస రావు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేశారు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని కోరారు. మృతదేహం వద్ద నీలి రంగు బ్యాగ్ లభించిందని, తెలుపు చొక్కా, ఫుల్ ప్యాంట్ దుస్తులు ధరించి ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో అన్నవరం దేవస్థానం ఉద్యోగి మృతి



తలుపులయ్య (ఫైల్)

అన్నవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పెద్దింటి తలుపులయ్య (58) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ప్రస్తుతం ప్రోటోకాల్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు దయాబెటీస్ ఉండడంతో కొంతకాలంగా నీరసంగా ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తలుపులయ్య మృతి పట్ల దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంటా విష్ణు, బలువు సత్యశ్రీనివాస్ సంతాపం తెలిపి నివాళులర్పించారు.

కోడిపందాలాడుతున్న 26 మంది అరెస్టు

రూ.96,700 నగదు, 25 సెల్‌ఫోన్లు, 20 బైక్‌లు, 3 కారులు, 3 కోళ్లు స్వాధీనం



కోరుకొండ మండలం మధురపూడిలో పట్టుబడ్డ 26 మందితో పోలీసులు

కోరుకొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ పోలీసులు కోడిపందాల శిబిరంపై మెరుపు దాడి చేశారు. తూర్పుగోదావరి జిల్లా స్పెషల్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు కోరుకొండ మండలం మధురపూడి గ్రామ శివారులో కోడిపందాలాడుతున్న వారిపై గురువారం అర్ధరాత్రి కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ పర్యవేక్షణలో ఎస్ఐ టి.శ్యామ్‌సుందర్, సిబ్బందితో దాడి చేశారు. 26 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.96,700 నగదు, 25 సెల్‌ఫోన్లు, 20 బైక్‌లు, 3 కారులు, 3 కోళ్ల స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రవాదుల దాడి అత్యంత కిరాతకం

సచ్చిదానంత సరస్వతి మహాస్వామిజీ



మీడియాతో మాట్లాడుతున్న స్వామిజీ

తుని రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అత్యంత కిరాతకమని తపోవన ఆశ్రమం పీఠాధిపతి సచ్చిదానంత సరస్వతి మహాస్వామిజీ అన్నారు. కాకినాడ జిల్లా తుని మండలంలో గల ఆశ్రమంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఉగ్రదాడి దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రకృతి అందాలను చూసేందుకు వచ్చిన పర్యాటకులపై కాల్పులు జరిపి హతమార్చడం హేయమైన చర్యగా అభివర్ణించారు. హిందువులని తెలుసుకుని చంపడం ఘోరాతి ఘోరమైన అంశమన్నారు. ఇటువంటి చర్యలను అందరూ ఖండించాలని కోరారు. ఉగ్రవాదం భావజాలంతో ఉన్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాజంలో శాంతి, సామరస్యమే ఉన్నతమైన వాతావరణాన్ని తీసుకువస్తుందని కానీ ఇలాంటి హింసాత్మక సంఘటనలు ఎటువంటి ప్రభావాన్ని చూపించవని అన్నారు. కేవలం మత పరమైన భావజాలంతో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం దారుణమైన విషయమని స్వామిజీ చెప్పారు. భారతదేశం మతాలు, వర్గాలకతీతంగా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఉగ్రవాదం అందరికీ ఉమ్మడి శత్రువు అని కేంద్ర నాయకత్వానికి భారతీయుల సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నాదానికి వ్యతిరేకంగా గళంవిప్పేందుకు భారతీయులు ఏకతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం



మాచవరం ప్రధాన కాలువలో మృతదేహం

రాయవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట-మాచవరం ప్రధాన కాలువలో మెయిన్‌రోడ్డు అనుకుని ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహన్ని స్థానికులు గుర్తించారు. నిక్కర్, బనియన్‌తో సుమారు 50 ఏళ్ల కలిగిన పురుషుడి మృతదేహం కాలువలో బాగా ఉబ్బి ఉండటంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. ఈ విషయాన్ని స్థానికులు 100 సమాచారం తెలియజేయడంతో రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని కాలువ నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఏలేరు కాలువలో...



రౌతులపూడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామ శివారు బంగారయ్యపేట వంతెన వద్ద ఏలేరు కాలువలో 60ఏళ్ల వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చిందని ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు తెలిపారు. తెలుపు రంగు మీద నలుపు చారలు హాఫ్ హ్యాండ్స్ గళ్ల చొక్కా, వైట్ బనియన్ వేసుకుని ఉన్నాడని, ఎత్తు 5.5 అడుగులు ఎత్తు, తెలుపు రంగు జుట్టు, తెలుపు గెడ్డం ఉన్నారు. ఆచూకీ తెలిసిన వారు రౌతులపూడి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

చెరువులో మోటారుసైకిల్ పడి వ్యక్తి మృతి

అల్లవరం ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సామంతకుర్రు పల్లిపాలేనికి చెందిన పెసింగి కామరాజు(65) మోటారుసైకిల్‌పై వెళ్తూ రోడ్డుపక్కన చెరువులో పడి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. భార్య అన్నపూర్ణను ఉపాధి పనుల నుంచి తీసుకువచ్చేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ చెరువులో పడిపోయాడు. చెరువులో అతడి మృతదేహన్ని గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య అన్నపూర్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అల్లవరం ఎస్ఐ టి.తిరుమలరావు తెలిపారు.

పంటకాలువలో జారి పడి వ్యక్తి గల్లంతు?

అమలాపరం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నడిపూడి లాకుల వద్ద ప్రధాన పంటకాలువలో శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి జారిపడి గల్లంతైనట్టు సమాచారం అందుకున్న అమలాపురం తలూకా పోలీసులు హుటాహుటీన అగ్నిమాపక సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రి 9 గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టినా గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదని తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. శ్రీరామ్‌నగర్‌కు చెందిన సరెళ్ల సురేష్‌కుమార్ ముంగండ గ్రామంలో జరిగిన వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ సంఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. అంతకు ముందు మధ్యాహ్న సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న సురేష్‌కుమార్‌ను స్థానికులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి సురేష్‌కుమార్ లేకపోవడంతో ప్రధాన పంటకాల్వలో జారి పడి గల్లంతైనట్టు భావిస్తున్నారు. గజ ఈతగాళ్లతోను గాలింపు చర్యలు చేపట్టారు. అయితే సురేష్‌కుమార్ గల్లంతయ్యాడా లేక ఎటువైపైనా వెళ్లిపోయాడా అన్న కోణంలోను పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.



మంచు.. మైమరపించు

శుక్రవారం సూర్యోదయం వేళ తూర్పుగోదావరి జిల్లా తీపర్రు వద్ద గోదావరి లంక ప్రాంతాల్లో మంచు దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించిందిలా..

పెరవలి(ఆంధ్రజ్యోతి)

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున నిత్య కైంకర్యాలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గర్భగుడి నుంచి ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. మండపంలోని ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్టింపచేసి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కురం విజయలక్ష్మి పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన

- పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్
- ఎకరం విస్తీర్ణంలో మండపం నిర్మాణం

కొత్తపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఉప్పాడ కొత్తపల్లిలో రూ.2కోట్ల నిధులతో నిర్మించే టీటీడీ కళ్యాణమండపానికి డిప్యూటీ సీఎం కె.పవన్ కళ్యాణ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఇక్కడ కళ్యాణమండప నిర్మాణానికి సర్వే నెం.23/1లో ఎకరం విస్తీర్ణంగల స్థలం కేటాయించారు. కళ్యాణమండపం నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.కోటి 60లక్షలు సమకూర్చగా రూ.40లక్షల సీఎస్ఆర్ నిధులతో కల్యాణ మండపాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన వైద్యవిభాగం ప్రతినిధి, సురక్ష మల్టీస్పెషాల్టీ హాస్పల్ అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి పిచ్చుక సాంబ శివరావు, ఎమ్మెల్యేలు జ్యోతులనెహ్రూ, పంతం నానాజీ, జనసేన నాయకులు, రావుఅక్షయ్, సోషల్ యాక్టివిస్ట్‌జ్యోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



తాగునీటి సమస్యకు పరిష్కారం చూపమని పవన్‌కల్యాణ్‌ను కోరుతున్న మహిళలు

మీ రాకతో మా సమస్యలకు పరిష్కారం

- పవన్‌కల్యాణ్‌ను కలిసిన మహిళలు

పిఠాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మీరు గతంలో వచ్చినప్పుడు విన్నవిస్తూ నాలుగు దశాబ్దాలుగా ఉన్న ఇళ్లపట్టాల సమస్య పరిష్కారమైందని పిఠాపురం పట్టణం రథాలపేటకు చెందిన మహిళలు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వద్ద ఆ నందం వ్యక్తం చేశారు. పట్టణంలో పర్యటిస్తున్న పవన్‌ను వారు శుక్రవారం కలిసి పూలవర్షం కురిపిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అదేరీతిలో కొత్తపల్లి మండలం వాకతిప్పలో ఎక్కువ సమయంలో కుళాయిలు ఇస్తే తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని, దీనిపై చొరవ తీసుకోవాలని కోరారు. ఎన్నికల ముందు ఈ సమస్యను పవన్ దృష్టికి తీసుకువెళ్లగా అధికారంలోకి రాగానే పైపులైన్లు, కుళాయిలు ఏర్పాటు చేశా రు. ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తయినందున వారం రోజుల్లోగా ఆ కాలనీకి పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. కొత్తపల్లి పోలీసుస్టేషన్ సమీపంలో బీసీ కమ్యూనిటీ హాలు నిర్మించాలని పలువురు కోరారు. పిఠాపురం పట్టణంలోని 15వ వార్డు మోహననగర్‌లో ట్యాంకర్లు ద్వారా పురపాలక సంఘం సరఫరా చేస్తున్న తాగునీరు రంగుమారి వస్తున్నదని ఆ ప్రాంతవాసులు పవన్‌కల్యాణ్ ఎదుట మొరపెట్టుకున్నారు. యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరించి సురక్షిత తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్ ఆంక్షలతో ఇక్కట్లు

పిఠాపురం/పిఠాపురంరూరల్/గొల్లప్రోలురూరల్ : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన సందర్భంగా పోలీసుల ఓవర్‌యాక్షన్ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. పవన్ మధ్యాహ్నం 12.27కు పిఠాపురం రాగా ఉదయం 8గంటల నుంచే వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా అవి అమలు కాలేదు. ఉదయం నుంచే ఉప్పాడ సెంటర్ నుంచి ఫైర్ ఆఫీస్ సెంటర్ వరకూ ఒకవైపు రాకపోకలు నిలిపివేయడంతో పాటు రెండవ వైపు ద్విచక్ర వాహనాలను అనుమతించకపోవడం, పెట్రోల్ బంకులు వద్ద ఉన్న మార్గాలను బారికేడ్లతో మూసివేయడంతో వాహనదారులు పడిన అగచాట్లు వర్ణనాతీతం. ప్రభుత్వాసుపత్రికి వచ్చిన రోగులను పోలీసులు లోపలకు అనుమతించకపోవడం విమర్శలకు దారి తీసింది. ఉప్పాడ బస్టాండు నుంచి ఫైర్‌ఆఫీస్ సెంటర్ వరకూ రోడ్డు మధ్యలోని డివైడర్ పొడవునా సుమారు రెండు కిలోమీటర్ల బారీకేడ్లు ఏర్పాటుచేసి ద్విచక్ర వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఏమిటని పలువురు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

న్యాయ వ్యవస్థ గౌరవాన్ని నిలబెడదాం

- జడ్జి గూడూరి హర్షవర్ధన్

పెద్దాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవ్యవస్థకు ఉన్నత స్థానం ఉందని ఆ గౌరవాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత న్యాయవాదులు, న్యాయమూర్తులపైన ఉందని పెద్దాపురం జూనియర్ సివిల్ జడ్జి గూడూరి హర్షవర్దన్ అన్నారు. ఇటీవల రాష్ట్ర హైకోర్టు న్యాయాధికారులను బదిలీ చేసిన నేపథ్యంలో పెద్దాపురం జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న గూడూరి హర్షవర్ధన్ పెద్దాపురం నుంచి విజయనగరంజిల్లా సాలూరుకు బదిలీ కావడంతో స్థానిక కోర్టులో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఏడవ అదనపు జిల్లా కోర్టు జడ్జి జి.చంద్రమౌళీశ్వరి, సీనియర్ సివిల్‌జడ్జి డాక్టర్ కె.దీపాదైవకృప, అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ గండిపోము బుల్లెమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



హర్షవర్ధన్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

కొనసాగిన దివ్యాంగుల రిలే దీక్షలు

గొల్లప్రోలు, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంవద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు రెండోరోజు శుక్రవారం కొనసాగాయి. దివ్యాంగులు ఆత్మాభిమానంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అన్ని ప్రభుత్వ పథకాల్లో 5శాతం నిధులు దివ్యాంగులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. రిలే దీక్షల్లో సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉలవశెట్టి శ్రీనివాసరావు, మాదేపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొనగా అమలాపురం పట్టణ దివ్యాంగ సమాఖ్య, అల్లవరం మదర్‌థెరిస్సా దివ్యాంగుల సంఘం, అంబాజీపేట దివ్యాంగుల సంఘం, యువ స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు మద్దతు తెలిపారు.

పది టాపర్ నేహాంజనికి సత్కారం

కాకినాడసిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరు మార్కులు సాధించిన టాపర్ యాళ్ల నేహాంజనిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కాకినాడజిల్లా అధ్యక్షుడు తుమ్మల దొర, ప్రధాన కార్యదర్శి వంగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభినందించారు. శుక్ర వారం టాపర్ నేహాంజని నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఐఏఎస్ తన ఆశయమని చెప్పిన నేహాంజని చదువుకోసం ఉపాధ్యాయ సంఘం ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్ ప్రణాళిక కోసం 2013 క్యాట్ ఆలిండియా టాపర్ తోటకూర శివసూర్యతేజ పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎంవీవీ సత్య నారాయణ, వర్ధినీడి పల్లంరాజు, తోటకూర సత్యనారాయణ, పోలిశెట్టి మూర్తి, ప్రసాద్, పి.దొరబాబు, డి.బాపిరాజు తదిత రులు పాల్గొన్నారు.



పది టాపర్ నేహాంజనిని సత్కరిస్తున్న దృశ్యం

పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు తల్లిదండ్రులు బాటలు వేయాలి

- ఏపీఎస్పీలో సమ్మర్ శిక్షణ శిబిరం ప్రారంభం

సర్పవరంజంక్షన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆశక్తి, అభిరుచిని గుర్తించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం ఏపీఎస్పీ ప్రాంగణంలో ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 25 నుంచి మే 18 వరకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల అభి రుచి, కోరికలను పిల్లలపై ఆపాదించి ఒత్తిడికి గురి చేయరాదన్నారు. విద్యార్థుల మానసిక వికాసం, శారీరక ధృడత్వానికి క్రీడలతో పాటూ విద్యా సామర్థ్యాలను పెంచుకునేందుకు వేసవి శిబిరం ఉపయోగపడుతుందన్నారు. సెలవుల్లో కాలక్షేపం కోసం కాకుండా సామర్థ్యాలను పెంచుకునేందుకు వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందావు, అసిస్టెంట్ కమాండెంట్లు బి.చంద్రశేఖర్, మన్మథరావు, రవిశంకర్, ప్రసాద్, స్కూల్ ప్రిన్సిపాల్ విలియంబెనర్జీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు



కాకినాడ నగరంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి పిఠాపురంలో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

ఉగ్రవాదుల దాడి అత్యంత హేయం

- సర్పవరం జంక్షన్‌లో మానవహారం
- స్వచ్ఛందంగా పాల్గొన్న విద్యార్థులు, ప్రజలు

సర్పవరంజంక్షన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్ము-కాశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులపై టెర్రరిస్టులు దాడిచేసి హత మార్చడం అత్యంత హేయమైన చర్య అని, జాతి మొత్తం అమరుల కుటుంబాలకు అండగా ఉంటుందని కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ పేర్కొన్నారు. జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు జనసేన కన్నీటి నివాళి కార్యక్రమంలో శుక్రవారంరాత్రి ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో అమరులైన వారికి నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు పవన్ ఆదేశాల మేరకు టెర్రరిస్టుల దాడిలో మృతిచెందిన యాత్రికుల కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సర్పవరం జంక్షన్‌లో ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి ర్యాలీ, మానవహారం కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన పిఠాపురం ఇన్‌చార్జి ఎం.శ్రీనివాస్, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు, ట్రాఫిక్ సీఐ రామారావుల ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పర్యాటకులపై దాడి అత్యంత అమానుషం

పెద్దాపురం: కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డం అమానుషమైన చర్యని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) అన్నారు. పహల్గామ్ ఉగ్రవాద చర్యలను వ్యతిరేకిస్తూ కూటమి నేతల ఆధ్వర్యంలో పట్టణంలో స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉగ్రదాడి భారతదేశంలోని ప్రజలందరినీ కలిచివేసిందని ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు, పోలమరశెట్టి సత్తిబాబు, కొరిపురి రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సాహితి స్రవంతి జిల్లా అధ్యక్షులు జోషుల కృష్ణబాబు, వర్క్ బోర్డ్‌సవరణ వ్యతిరేకత కన్వీనింగ్‌కమిటీ కన్వీనర్ ముక్తర్ అలీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్రదాడిపై కూటమి నివాళి

సామర్లకోట: జమ్మూ కాశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిని నిరశిస్తూ సామర్లకోటలో శుక్రవారం సాయంత్రం కూటమి నాయకులు నివాళులర్పించారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) పాల్గొని మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి ఘటనను చీకటి చర్యగా అభివర్ణించారు. ఉగ్రవాద చర్యల వలన నష్టపోయిన కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే చినరాజప్ప, తుమ్మల బాబులు నివాళులర్పించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని శాంతి ర్యాలీ..

కాకినాడ సిటీ: కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడిచేసి 29 మందిని చంపిన ఉగ్రవాదులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరుతూ కాకినాడ ముస్లిం జేఏసీ, ట్రూ మెసేజ్ సంటర్, ఐడియల్ యూత్ మూమెంట్, జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు తొలుత ఈ దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పించారు. హింస ఆగాలి, శాంతి వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ట్రూ మెసేజ్ సెంటర్ సభ్యుడు అఖిర్ ఆలీ, ఐడియల్ యూత్ మూమ్మెంట్ రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్ హుస్సేన్‌లు మాట్లాడుతూ పర్యాటకులపై దాడి పిరికిపంద చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదుల ను పట్టుకుని కఠినమైన శిక్షలు విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ నగర సభ్యులు రహం తుల్లా షరీఫ్, ఖాజా మొహిద్దీన్, అబ్దుల్ వహీద్, ఎస్ఐవో నగర అధ్యక్షుడు సహెల్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు టీడీపీ నివాళి

పిఠాపురం: జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారికి తెలుగు దేశం పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. పిఠాపురం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కమిటీల ఏర్పాటుపై ఎమ్మెల్యే సమీక్ష

పెద్దాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ కోసం శుక్రవారం పట్టణ పరిధిలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు స్వగృహంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కమిటీల ఏర్పాటు మండలంలో గ్రామ, బూత్, యూనిట్, క్లస్టర్, మండల కమిటీల నిర్మాణంపై కార్యకర్తలతో చర్చించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని ఈ పదవుల్లో నియమించనున్నట్లు ఎమ్మెల్యే చినరాజప్ప పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రంధి సత్యనారాయణ, కొరుపూరి రాజు, నూనె రామారావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆరోగ్యంపై అవగాహన

పెద్దాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రముఖ వైద్య నిపుణురాలు విజయలక్ష్మి, ఎన్‌సీసీ క్యాడెట్లకు యోగా, పాపిలోమో వైరస్, సర్వికల్ క్యాన్సర్ మొదలై అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ మేజర్ కె.మహమ్మద్ అసిఫ్, లెఫ్టినెంట్ సత్యనారాయణ, సుబేదార్ మేజర్ హేమంత్‌కుమార్, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ రాంబాబు, థర్డ్ ఆఫీ సర్ ప్రసాద్, సెకండ్ ఆఫీసర్ అబ్బులు, నవోదయ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జేసీవో స్టాఫ్ శక్తివేణు, రఫీ, గురివిందర్ పాల్గొన్నారు.

17 మంది వాహనదారులకు జైలు

కాకినాడ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 17 మందికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీస్‌స్టేషన్ల పరిధిలో కాకినాడ సిటీలో డ్రంక్ అండ్ డ్రైవ్ శిబిరం నిర్వహించారు. ఈ తనిఖీల్లో 28 మంది వాహనదారులు మద్యం తాగి బైక్‌లు నడుపుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. వీరిని కాకినాడ ఏజేఎఫ్‌సీఎం కోర్టులో ప్రవేశ పెట్టగా ఒకరికి 5రోజులు జైలుశిక్ష, 16 మందికి తలో రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి డి.శ్రీదేవి తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ సీఐలు రమేష్, రామారావులు తెలిపారు. మిగతా 11మందికి తలో రూ.10వేలు వంతున రూ.1.10లక్షలు జరిమానా విధించామన్నారు.

కళాశాల భవనానికి మోక్షం కల్పించాలి

- మానవహక్కుల పరిరక్షణ సంఘం వినతి

సామర్లకోట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరినందున సత్వరం మరామ్మత్తు పనులు చేపట్టి విద్యార్థులకు, లెక్చరర్లకు భద్రత కల్పించాలని జిల్లా మానవహక్కుల పరిరక్షణ సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మ కాయల చినరాజప్పకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అచ్చంపేటలో ఎమ్మెల్యేను కలిసి అప్పలకొండ కళాశాల సమస్యలపై సుదీర్ఘంగా వివరించారు. దీనిపై ఎమ్మెల్యే చినరాజప్ప స్పందించి ఇంటర్మీడియట్ ఉన్నతాధికారులతో చర్చించారు. త్వరలోనే కళాశాలలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చినరాజప్ప అప్పలకొండకు హామీ ఇచ్చారు. కుంచే నానిబాబు, ఎస్ఏ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించేవరకూ అద్దెలు చెల్లించొద్దు

శిథిలస్థితికి చేరిన సామర్లకోట బసివిరెడ్డి సత్రం వాణిజ్య సముదాయాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టేవరకూ లీజుదారులు అద్దెలు చెల్లించొద్దు అని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చిరువ్యాపారులకు భరోసా ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం సత్రం వ్యాపారులు పలువురు ఎమ్మెల్యే చినరాజప్పను కలిసి తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్న వించారు. సత్రం పాలకవర్గం, దేవదాయాధికారుల సమక్షంలో ఈ మేరకు త్వరలోనే వ్యాపారులతో కలిసి సమావేశం నిర్వహిం చాలన్నారు. సదుపాయాలు కల్పిస్తేనే అద్దెలు చెల్లిస్తారన్నారు. సామర్లకోట స్టేషన్ సెంటర్ గడియార స్తంభం వద్ద నూత నంగా ఆధునీకరించిన గ్రీనరీలాన్ నీటిత డులు లేక ఎండిపోవడంపై ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మున్సిపల్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ విద్య బలోపేతం

కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వం విద్యకు ఎంతగానో ప్రాధాన్యం ఇస్తుందని, అందుకు ఈ ఏడాది పదోతరగతి పరీక్షా ఫలితాలే నిదర్శనమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నతపాఠశాల ఆవరణలో ఇటీవల పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల అభినందన సభ శుక్రవారం సాయంత్రం పాఠశాల ఆవరణలో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థి 585 మార్కులతో మండల స్థాయిలో ప్రథమస్థానంతోపాటు జిల్లా స్థాయిలో టాప్ టెన్‌లో ఉండడం అభినందనీయం అన్నారు. పాటశాల నుంచి పదవతరగతిలో 500 పైబడి మార్కులు సాధించిన 16 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే చినరాజప్ప, కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి గోల్డ్‌మెడల్స్, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన ఉపాధ్యాయబృందాన్ని అభినందించారు.



ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

రాష్ట్ర పరిశీలకులచే శిక్షణా శిబిరం పరిశీలన

సామర్లకోట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రారంభమైన అటల్ టింకరింగ్ ల్యాబ్ శిక్షణాతరగతులను విద్యా శాఖ యూనిసెఫ్ రాష్ట్ర పరిశీలకుడు టి.సుదర్శన్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. జిల్లాలో వివిధ మండలాల నుంచి ఎంపికచేసిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ శిక్షణా తరగతులు సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గండేపల్లి, ఉండూరు, కిర్లంపూడి, సామర్లకో టల నుంచి ఎంపిక చేసిన 50 మంది విద్యార్థులు ఈ శిక్షణా తరగతులలో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు యూ.మీనామా ధురి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణా తరగతులను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు సుదర్శన్ మాట్లాడుతూ తరగతి గదిలో విద్యతో బాటూ పిక్టోబ్లాక్స్ కోడింగ్, ఫోటోట్రానిక్స్, కోడింగ్ 3డీ, డిజైనింగ్, ప్రింటింగ్ వంటి కీలక అంశాలను విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. అటల్ టింకరింగ్ నోడల్ అధికారి కళ్యాణ్‌చక్రవర్తి, డీఎస్వో వినీల ఎంఈవోలు వై. శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

స్థల వివాదంలో వ్యక్తిపై కత్తితో దాడి

- నానికి విచక్షణారహితంగా కత్తిపోట్లు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సరిహద్దు స్థల వివాదంలో ఓ వ్యక్తిపై ఇంటి పక్కన నివసించే వ్యక్తి కత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడిన సంఘటన శుక్రవారం ఎస్.అచ్యుతాపురంలో జరిగింది. కాకినాడ 48వ డివిజన్ పరిధిలోగల ఎస్.అచ్యుతాపురంలో కుక్కల నాని, పెంకే జాజిలు పక్క పక్కన ఇళ్లల్లో నివసిస్తున్నారు. వీరు రెండు కుటుంబాల మధ్య స్థల వివాదం గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. కుక్కల నాని అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా శుక్రవారం సాయంత్రం పెంకే జాజి కత్తితో నాని పొట్టలో విచక్షణారహితంగా కత్తితో పొడిచి హత్యకు ప్రయత్నించాడు. కత్తిపోట్లకు పొట్టలోని పేగులు బయటకు రావడం, తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిపోయాడు. ఈ సమయంలో చుట్టుపక్కల వాళ్లు రావడంతో నిందితుడు పరారీ అయ్యాడు. సమాచారం అందుకున్న ఇంద్రపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రక్తపు మడుగులో ఉన్న బాధితుడిని హుటాహుటిన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు తెలిపారు. గతంలో వీరిద్దరి మధ్య కొట్టుకున్న కేసులు ఉన్నాయన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే కొండబాబు



సీఎం చంద్రబాబును కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడసిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడును శుక్రవారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కలిసి నగర అభివృద్ధి తదితర అంశాలపై వివరించారు స్మార్ట్ సిటీ నిధులు విడుదల చేయాలని, ఉప్పుటేరుపై మూడో వంతెనకు నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే కొండబాబు వెంట కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బచ్చు శేఖర్ ఉన్నారు.

మే 5 నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు

కాకినాడసిటీ, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో మే 5 నుంచి కాకినాడ వాకలపూడిలోని డీడీయుజీకేవై సెంటర్‌లో నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ శిక్షణకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాలలోపు పురుష అభ్యర్థులు అర్హు లన్నారు. టు వీలర్ టెక్నీషియన్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సులకు 3 నెలలు శిక్షణ ఇచ్చి అనంతరం ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం సెంట్రల్ గవర్న మెంట్ ద్వారా సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఈ కోర్సులతో పాటు అదనంగా బేసిక్ కంప్యూటర్ కోర్సు, కమ్యూనికేషన్ స్కిల్స్ ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మే 4వ తేదీలోపు సెల్ నెం.8328483297, 8978475164లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ వివేకానంద పార్కులో గల తమ శాఖ గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నామని గాంధీనగర్ శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదవడం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, సంగీతం తదితర అంశాలలో శిక్షణ ఇస్తామన్నారు.

మే 1 నుంచి యోగా శిక్షణా శిబిరం

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ వివేకానంద పార్కులో ఉన్న రెడ్‌క్రాస్ యోగా కేంద్రంలో మే1 నుంచి 15 వరకు 8 నుంచి 14 సంవత్సరాల వయస్సులోపు బాల, బాలికలకు వేసవి యోగా శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగే ఈ శిక్షణా శిబిరంలో పిల్లలకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, సూర్య నమస్కారాలు, ధార్మిక, నైతిక విలువలు, దేశభక్తి గీతాలు, హస్తకళలు, చేతి రాత మెళకువలు, బుద్ధి వికాసాన్ని పెంచే ఆటలు, ప్రథమచికిత్సలో శిక్షణలు ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 9603881211, 9640983726కు సంప్రదించాలన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న 50 మందికి మాత్రమే అవకాశమని తెలిపారు.

మే 7 నుంచి ఉచిత సమ్మర్ క్యాంప్

పెద్దాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్(పీసీసీ) ఆధ్వర్యంలో స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో మే 7 నుంచి జూన్ 9వరకు ఉచిత సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్ధ శ్రీనివాస్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఉదయం 6.30నుంచి 8.30వరకు కరాటే, సాయంత్రం 4గంటల నుంచి 7గంటల వరకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. మే 5వతేదీలోపు సమ్మర్ క్యాంప్‌కు వచ్చేవారు 9441709187, 9000695301, 7901697939లో సంప్రదించాలన్నారు. అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, అమృత, నమ్రత, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణా శిబిరం ప్రారంభం

సామర్లకోట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఎస్వీఎస్ఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కబడ్డీ, ఖోఖో క్రీడా శిక్షణా శిబిరాలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)లు సంయుక్తంగా ప్రారంభించారు. క్లబ్ ప్రతినిధులు కొండపల్లి శ్రీనివాసు, కోచ్ బోగిళ్ళ మురళీకుమార్, పోతుల సాయి ప్రసాద్, నిమ్మకాయల కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రీడా శిక్షణాశిబిరానికి తమ వంతు సహాయం అందిస్తామని ఎమ్మెల్యే చినరాజప్ప, తుమ్మల బాబులు హామీ ఇచ్చారు.

హైస్కూల్ టాపర్‌కు అభినందన

గండేపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లి హైస్కూల్‌లో పదోతరగతి ఫలితాల్లో 529 మార్కులతో ప్రథమ స్థానం సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిన పోతుల మధుశ్రీలక్ష్మిని శుక్రవారం హెచ్‌ఎం సుధామాధురి, సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు, ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను, విద్యా కమిటీ చైర్మన్ కంచర్ల సుబ్రహ్మణ్యం అభినందించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ప్రపంచానికి ఉగ్రవాదం ప్రమాదకరం




మోతుగూడెం: కొవ్వొత్తులతో ర్యాలీ, వై.రామవరంలో ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ

మోతుగూడెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ఉగ్రవాద దాడిని ప్రపంచ దేశాలు ఖండించాలని సర్పంచ్ ఆకేటి సీత, మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి మోతుగూడెం మార్కెట్ సెంటర్‌లో పహల్గాం దారుణ మారణకాండను ఖండిస్తూ మోతుగూడెం యూత్, జెన్‌కో ఉద్యోగస్తులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో అధికారి, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ మాట్లాడుతూ పాకిస్తాన్‌ను ఉగ్రవాదం దేశంగా ప్రకటించడంతో పాటు ప్రపంచ దేశాలన్నీ ఈదుర్మార్గాన్ని ఖండించాలన్నారు. ఉగ్రవాద దాడిలో మృతులకు ఆత్మశాంతి చేరుకోవాలని మోతుగూడెం యూత్, లోయర్ సీలేరు జెన్‌కో ఉద్యోగస్తులు, గ్రామస్తులు, విలేకరుల ఆధ్వర్యంలో ప్రగాఢ సంతాపం తెలిపారు. మోతుగూడెం మార్కెట్ సెంటర్ నుంచి జగదాంబ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేశారు.

ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ

వై.రామవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద చర్యను ఖండిస్తూ జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి (ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం వై.రామవరం బస్‌సెంటర్‌లో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ ఫౌండర్ టీఎస్ రామచంద్ర నాయుడు ఆదేశాలతో మండల అధ్యక్షుడు బి. నూకరాజు ఆధ్వర్యంలో ప్లకార్డులతో మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కనకరాజు, కన్వీనర్ మాడి సూరిబాబు, మహిళా అధ్యక్షు రాలు కె. శుభలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కూనవరం: బీజేపీ నాయకుల ర్యాలీ

పాకిస్థాన్‌ను ఖతం చేస్తాం

కూనవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్తాన్‌ను ఖతం చేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. పహల్గాం దాడికి నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య మాట్లాడుతూ తెర వెనుక నుంచి పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. పౌరులపై తుపాకులతో కాల్చి చంపడం దారుణమన్నారు. దీనికి భారత్ బదులు తీర్చుకుంటుందని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌కు కేంద్రం తగిన బుద్ధి చెబుతుందన్నారు. కార్యక్రమంలో నోముల రామారావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా రహిత మన్యమే లక్ష్యం




చింతూరు: ర్యాలీలో పాల్గొన్న ఐటీడీఏ పీఓ శిక్షణ అపూర్వభరత్, రంప: ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

చింతూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియా రహిత మన్యమే లక్ష్యమని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలనా దినోత్సవం సందర్భంగా చింతూరులో వైద్యశాఖ నేతృత్వంలో ర్యాలీ చేశారు. ర్యాలీలో పాల్గొన్న పీవో మాట్లాడుతూ మలేరియా నిర్మూలనకు పరిసరాల శుభ్రతే ముఖ్యమన్నారు. మలేరియా వ్యాప్తి గ్రామాల్లో విధిగా దోమ తెరలు వినియోగించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా దోమల నివారణ మందు పిచికారీ చేపట్టాల్సి ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. చింతూరు డివిజన్‌లో 2023లో 591 మలేరియా పాజిటివ్ కేసులు నమోదు కాగా 2024లో 382, 2025 ఏప్రిల్ 20 వరకు 170 మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయన్నారు. డివిజన్‌లో 192 గ్రామాల్లో మలేరియా వ్యాప్తి అధికంగా ఉన్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ముందుగా దోమల నివారణ మందు పిచికారీ చేయించాలన్నారు. మలేరియా వ్యాప్తికి గల కారణాలపై ప్రజలకు వైద్యశాఖ అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటా దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, తులసిపాకల ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ నిఖిల్, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

వైద్యాధికారులు కేవీన్, శ్వేత

రంపచోడవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు కేవీన్, శ్వేత అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే మలేరియా దోమల నివారణ మందును ప్రతి ఇంట్లో తప్పక పిచికారీ చేయించుకోవాలన్నారు. ఎంపీహెచ్‌వో శ్రీనివాసరాజు, హెల్త్ వర్కర్లు వై.చిన్నారావు, లవకుశ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రీసర్వే వివరాలు ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలి

సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ మండలాల్లోని గ్రామాల్లో భూములకు సంబంధించిన రీసర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆమెతో పాటు ఆర్‌డీడీ సర్వే కెజియా కుమారి సందర్శించారు. ఈసందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ సర్వే వివరాలను వీఆర్వోలు తహశీల్దార్ల లాగిన్లకు అప్‌లోడ్ చేయాలన్నారు. రీసర్వేలో ఇబ్బందులుంటే తమకు తెలియజేయాలని సూచించారు. కెజీయా కుమారి మాట్లాడుతూ ఏజెన్సీలో ఇంకా 268 గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ కుమార్, ఏడీ సీఎస్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నోడల్ అధికారి ఐ.ఓ.ఎస్.నాగేశ్వరరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.లక్ష్మణ్, తహశీల్దార్లు పి.రామకృష్ణ, కె.సూర్యనారాయణ, కరక సత్యనారాయణ, వేణుగోపాల్, బాలాజీ, డీటీలు స్వామి, శ్రీరాములు, మండల సర్వేయర్లు, సచివాలయాల సబ్బంది, వీఆర్వోలు పాలొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాద భద్రతపై అవగాహన కల్పిస్తున్న చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

చింతూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలగి ఉండాలని చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి అన్నారు. ఏరియా ఆసుపత్రిలో ఫైర్ సేఫ్టీ వీక్ కార్యక్రమం నిర్వహించారు. ముగింపు రోజు సందర్భంగా డాక్టర్ కోటిరెడ్డి సిబ్బందికి ఫైర్ సేఫ్టీపై పలు సూచనలిచ్చారు. అగ్ని సురక్షిత సమాజం కోసం అందరం కలిసి పనిచేద్దామన్నారు. డాక్టర్ కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సాయికిషోర్ రెడ్డి, డా. జ్యోత్స్న ప్రియ, డాక్టర్ భరద్వాజ్, ఫైర్ సేఫ్టీ అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై నిరసనలు



జగ్గంపేటలో మానవహారం నిర్వహిస్తున్న జనసేన నాయకులు, ప్రజలు

జగ్గంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా జిల్లా జగ్గంపేట సున్నీ జామియా మసీద్‌లో శుక్రవారం నల్ల రిబ్బన్లు, జెండాలతో ముస్లిం సోదరులు నిరసన వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్‌ఏగఫూర్ ఆధ్వర్యంలో కాశ్మీర్‌లో టూరిస్ట్ భారతీయులను కాల్చి చంపిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 28 మంది ప్రాణాలు తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధర్వంలో జగ్గంపేటలో పాత పోలీస్‌స్టేషన్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. భారత్ మాతాకీ జై, హిందువులపై ఉగ్రదాడులు నశించాలని అంటూ నినాదాలు చేశారు.

గండేపల్లి: పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ గండేపల్లి జాతీయ రహదారిపై గ్రామస్తులు కొవ్వొత్తులర్యాలీ చేశారు.

శంఖవరం: అమాయక ప్రజలపై కాల్పులు జరిపిన తీవ్రవాదులపై కఠినమైన చర్యలు చేపట్టాలని జనసేన నేత మేకల కృష్ణ డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో హిందూ, క్రైస్తవ, ముస్లిం మత సభ్యులు పహల్గామ్ సంఘటను ఖండిస్తూ స్థానిక తహశీల్దార్ తాతారావుకి వినతి పత్రం అందించారు. 28మంది పర్యాటకుల మరణానికి కారణమైన కిరాతకుల ఏరివేతే సరియైన మార్గమని, కేంద్రప్రభుత్వానికి

పలుచోట్ల కొవ్వొత్తుల ర్యాలీలు

దేశంలో ప్రతీపౌరుడూ అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అడపా వెంకటేష్, పడాల నానా జీ, జట్లా లక్ష్మణరావు, పొలమాటి శాంతి భరత్, సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.

రాజకీయం చేయవద్దు

రౌతులపూడి: కాశ్మీర్‌లో పర్యాటలకు మరణ సంఘటనను రాజకీయం చేయవద్దు అని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బగతా బంగార్రావు అన్నారు. రౌతులపూడిలో పద్మనాభ కమ్యూనిటీ హాస్ నందు ఆ పార్టీ మండల మహాసభ జరిగింది. ముఖ్యఅతిథిగా బంగార్రావు మాట్లాడారు. మండల కార్యదర్శి సామిరెడ్డి నారాయణ మూర్తి, బడే జ్యోతి, వెంకటస్వామి పాల్గొన్నారు. ముష్కరుల దాడిని నిరసిస్తూ ఎ.మల్లవరంలో గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీని టీడీపీనేత లెక్కల రాము ఆధ్వర్యంలో చేశారు.



గండేపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ దృశ్యం

క్రీడలతో మానసిక ఉల్లాసం

జగ్గంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ద్వారా మానసిక ఉల్లాసం, శరీర ధారుడ్యంతో పాటు భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటలో ఉద్యోగాలు కూడా సాధించవచ్చని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం గోకవరం రోడ్‌లోని క్రీడా వికాస కేంద్రాన్ని ఆయన పరిశీలించి వివరాలు తెలసుకున్నారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, కొత్త కొండ బాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, అడబాల వెంకటేశ్వరరావు, కోర్పు సాయితేజ, మండపాక అప్పన్నదొర, తిరుమలాయపాలెం సర్పంచ్ పురంశెట్టి శివాజీ, యల్లమిల్లి మాజీ సర్పంచ్ బూర ప్రసాద్, మారిశెట్టి రాధా, నలమాటి ఆనంద్, రాయిసాయి పాల్గొన్నారు.

'వక్ఫ్' చట్టంపై అవగాహన

ప్రత్తిపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మంగి ముస్లిం వీధిలో శుక్రవారం వక్ఫ్ సవరణ చట్టంపై బీజేపీ నాయకులు అవగాహన సమావేశం నిర్వహించారు. 2025 వక్ఫ్ సవరణ చట్టం ప్రకారం దశాబ్దాలుగాపేద బడుగు, బలహీన వర్గాల ముస్లిం మహిళలు, యువతకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ముస్లిం సోదరులకు జరుగుతున్న అన్యాయాన్ని సరి చేయడానికే ప్రధాని మోదీ ఈ చట్టం తీసుకొచ్చారని, ప్రోగ్రాం జిల్లా కో కన్వీనర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజు, నాయకులు కందా వీరాస్వామి, దేవర రామకృష్ణ, నక్కా శ్రీను, తేజోమూర్తుల ఉషా రాణి, సిద్దపు రెడ్డి చంద్రరావు ఉన్నారు.

బీజేపీ నూతన కార్యవర్గం

కిర్లంపూడి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో శుక్రవారం బీజేపీ మండలాధ్యక్షుడు శరకణం రాజబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బీజేపీ జగ్గంపేట ఇన్‌చార్జి దాట్ల కృష్ణవర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల బీజేపీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన కార్యదర్శులుగా ఐవివి సత్యనారాయణమూర్తి, కంతా కాశీవిశ్వనాద్, ఉపాధ్యక్షులుగా ఈసారపు శివ బాబు, కె.శ్రీను, బి.కాశీ, పెదకాపు, కార్యదర్శులుగా మంగతాయారు, పి.నాగేశ్వరరావు, సత్యనారాయణ, వెంకటేష్, కోశాధికారిగా పి.లోవరాజు ప్రమాణ స్వీకారం చేశారు.

సహాయక సంఘాల జీవనోపాధి పెంపునకు కృషి

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు



ప్రత్తిపాడులోని వెలుగు కార్యాలయాన్ని సందర్శించిన డీఆర్‌డీఏ పీడీ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వయం సహాయక సంఘాల జీవనోపాధుల పెంపుదలపై ప్రగతి సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించి ఏపీఎం వెంకట్, సీసీలు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి డ్వాక్రా మహిళా ఇంటిపైన సోలార్‌రూఫ్ టాప్ వేయించుకుని విద్యుత్ ఉత్పత్తి చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. స్త్రీనిధి అభివృద్ధితో పాటు సీఐఎఫ్ అప్పులకు సంబంధించిన ఏవిధమైన బకాయిలు లేకుండా డ్వాక్రా సంఘాలకు అవగాహన కల్పించి సమావేశం చేయాలన్నారు. అనంతం ప్రభుత్వాసుపత్రిలో సదరం రీ వెరిఫికేషన్ శిబిరాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా సమైక్య జనరిక్ షాపును పీడీ పరిశీలించారు. ప్రత్తిపాడు, ధర్మవరంలో డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసుకున్న అగర్‌బత్తి యూనిట్, ఎంబ్రాయిడరీయూనిట్‌ను పీడీ పరిశీలించారు. ఆయన వెంట ఏపీఎం వెంకట్రావు, సీసీలు శ్రీనివాస్, నూకరత్నం, అకౌంటెంట్ నాగేశ్వరావు, వీవోఏలు కల్యాణి, భవాని, గంగాభవాని, వరలక్ష్మి, ప్రియాంక, సత్య ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే

జగ్గంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ నిర్వహించినట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం జగ్గంపేట రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వింటూ పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

'రైతుల శ్రేయస్సు లక్ష్యం'



యనమలను సత్కరిస్తున్న పాలక వర్గ సభ్యులు

తుని రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా జనసేన నేత అద్దేపల్లి బాలాజీ సతీమణి అద్దేపల్లి జానకి గౌరీ ఎంపికయ్యారు. డైరెక్టర్లుగా తుని మండలం ఎన్.చామవరం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు బొప్పన రాము, తిమ్మాపురం గ్రామానికి చెందిన పోల్నాటి ఉమా, తాళ్లూరు గ్రామానికి చెందిన శేఖర్ రబ్బాని పదవుల సాధించారు. ఎంపికైన ఏఎంసీ పాలక వర్గ సభ్యులు చైర్మన్‌తో కలిసి మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుని తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్వాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుకుంటామని, రైతుల శ్రేయస్సు లక్ష్యంగా పని చేసి రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామన్నారు.

17 మందికి ఉద్యోగాలు

తొండంగి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాల విద్యార్థులు జాబ్ మేళాలో సత్తా చాటారు. కాకినాడలో నిర్వహించిన జాబ్ మేళాకు తమ కళాశాల తరపున 19 మంది హాజరు కాగా 17 మంది ఉద్యోగాలు పొందినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ తెలిపారు. జాబ్ కన్వీనర్ కృష్ణారావు, సిద్దార్థబాబు,స్వర్ణలత అభినందించారు.

వరదనీరు కాదు మురుగునీరే!

శంఖవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పక్కన చిత్రంలో ఉన్నది వరదనీరు అనుకుంటే మీరు పొరపడినట్టే. కత్తిపూడి 16వ నెంబరు జాతీయ రహదారిపై చేరిన మురుగునీరు. పంచాయితీ సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహించకపోవడం, డ్రైన్ల నిర్వహణలో లోపం ఉండటంతో డ్రైన్లు ఏరులై పారి మురికి నీరు ఇలా రోడ్లపై ప్రవహిస్తుంది. నెల్లిపూడి రోడ్డు సమీపంలో పరిస్థితి ఇలా ఉంది. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు చిత్తశుద్ధి కనబరచాలని ప్రజలుకోరుతున్నారు.



దబ్బగూడెంలో మంచినీటి కష్టాలు



నీటి కోసం బిందెలతో ఎదురుచూస్తున్న ప్రజలు

మోతుగూడెం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పరిధిలో గూడూరు పంచాయతీ దబ్బగూడెం గ్రామంలో ఉన్న బోరింగ్ పంప్ పని చేయడం లేదు. తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని దబ్బగూడెం గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30కుటుంబాలకు ఒక బోరింగ్ పంప్ ఉంది. నీరు అడుగంటిపోవడంతో ఎంత కొట్టినప్పటికీ నీరు అరకొరగా వస్తుంది. ఒక బిందు నీరు నింపాలంటే గంటపైనే సమయం పడుతుంది. దీంతో దబ్బగూడెం గ్రామ ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే కొద్దిపాటి నీటి కోసం పడిగాపులు కాస్తూ ఎండలో కూర్చుంటున్నారు. అధికారులు స్పందించి మా గ్రామానికి నీటి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. ఐటీడీఏ పీవో స్పందించి జల జీవన్ మిషన్‌లో భాగంగా తాగునీటి పథకం ఏర్పాటు చేసి ఇంటింటికి తాగునీటి సౌకర్యం కల్పించాలని వారంతా కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

రంపచోడవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 2023 డిసెంబర్ ఒకటో తేదీ నుంచి 2024 అక్టోబర్ 31 తేదీ మధ్య కాలంలో భర్త సామాజిక పింఛన్లు పొందుతూ మృతి చెందితే భార్య సామాజిక పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం తెలిపారు. అర్హత గల లబ్ధిదారులు సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని శాంతి ర్యాలీ

కాకినాడ సిటీ: కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడిచేసి 29 మందిని చంపిన ఉగ్రవాదులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరుతూ కాకినాడ ముస్లిం జేఏసీ, ట్రూ మెసేజ్ సంటర్, ఐడియల్ యూత్ మూమ్మెంట్, జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు తొలుత ఈ దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పించారు. హింస ఆగాలి, శాంతి వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ట్రూ మెసేజ్ సెంటర్ సభ్యుడు అఖిర్ ఆలీ, ఐడియల్ యూత్ మూమ్మెంట్ రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్ హుస్సేన్‌లు మాట్లాడుతూ పర్యాటకులపై దాడి పిరికిపంద చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదుల ను పట్టుకుని కఠినమైన శిక్షలు విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ నగర సభ్యులు రహం తుల్లా షరీఫ్, ఖాజా మొహిద్దీన్, అబ్దుల్ వహీద్, ఎస్ఐవో నగర అధ్యక్షుడు సహెల్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీహోమం



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీసప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం తీర్థప్రసాదాలందజేశారు.

బసవేశ్వరునికి అభిషేకాలు



రాచపల్లిలో బసవేశ్వరునికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో శుక్రవారం బసవేశ్వరునికి 21 ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. రమణ సేవాశ్రమ, ఆలయ నిర్వాహకులు రమణానంద స్వామి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా పంచామృతాలతో పాటు వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆడపిల్లల అభ్యున్నతికి కృషి

శంఖవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల అభ్యున్నతికి చంద్రబాబు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి వెంకటసుభాష్ అన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో వజ్రకూటంలో కొబ్బరి మొక్కలను నాటారు. అంగన్‌వాడీ సిబ్బంది, కీర్తి నాగేశ్వరావు, కేశంగి సూర్యారావు,కీర్తి రాజు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలూరు వెంకటపతిరాజు చెరువు కాలువ అభివృద్ధి పనులకు శుక్రవారం సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పారావు శ్రీకారం చుట్టారు. రూ.10లక్షల నిధులతో ఏలూరు నుంచి ప్రత్తిపాడు వరకు కాలువలు రాలేవలే అభివృద్ధి పూడిక తీత పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏలూరు టి.రాయవరం సర్పంచ్‌లు రొంగత సత్యనారాయణ, తటవర్తి సుబ్బారావు, టీడీపీ నాయకులు అడ్డాల త్రిమూర్తులు, మదినే దొరబాబు, కొట్టేటి అబ్బులు, ఇరిగేషన్ డీఈ రాజేంద్రప్రసాద్, జెఈ ఇబ్రహం, నీటి సంఘం డైరెక్టర్లు వనపర్తి భద్రం, సింగిలిదేవి సత్తిబాబు, వెంకటరమణ తదితరులున్నారు.

జడ్జి భానుకు సన్మానం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద వృత్తి చాలా పవిత్రమైనదని జడ్జి కాటం భాను చెప్పారు. స్థానిక కోర్టు హాల్‌లోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బదిలీపై వెళ్తున్న జడ్జి కాటం భానును న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, పూర్వ అధ్యక్షులు బుగతాశివ, కొల్లా వీర్రాజు, ఇన్‌చార్జ్ మేజిస్ట్రేట్ జి.బుల్లమ్మలు మాట్లాడారు. కార్యక్రమంలో బార్ నాయకులు గౌరీశంకర్, నాగేశ్వరరావు, నాగేంద్రరాజు, ఆడారి సుగుణ, పి.కాశీప్రసాద్, మల్లేశ్వరరావు, దేవి, నరసింహారావు, చలం, రవికుమార్, ప్రసన్న, సృజన, శివకుమార్ పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన

ఏలేశ్వరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని జె.అన్నవరం ప్రభుత్వాసుపత్రి, ఏలేశ్వరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ర్యాలీ నిర్వహించారు. మలేరియాపై ప్రజలకు అవగాహన సదస్సు కల్పించారు. వైద్యులు, ఆశా వర్కర్లు ఉన్నారు.